ప్రజాశక్తి

శుక్రవారం 22 నవంబర్ 2024

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి





ఉత్సాహం, ఉత్తేజం.. విశాఖ బాలోత్సవం



నృత్యాలతో అలరించిన విద్యార్థినులు

- సామాజిక స్పృహ నింపిన పిల్లల పండగ
- అలరించిన శాస్త్రీయ, జానపద నృత్యాలు
- ఆకట్టుకున్న లఘు నాటికలు, కవితలు, శాస్త్రీయ ఆలోచనారీతులు
- దేశభక్తిని రేకెత్తించిన ఏకపాత్రాభినయాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మూడు రోజుల పాటు విశాఖ నగరం బాల, బాలికల ఆటపాటలతో పులకించింది. వారి ఉత్సాహం, ఊపు చూస్తే ఏటా వచ్చే ఒక దీపావళి చాలదు. అలాగే ఒక పెద్ద పండగ సంక్రాంతి, భోగీ ఈ రెండింటి తర్వాత వచ్చే కనుమ ఈ పండగలన్నీ కలిసి ఒకేసారి వస్తే ఎలా ఉంటుందో.. అంత సరదా, ఆనందం అక్కడ కనిపించింది. ఈ నెల 19 నుంచి 21 వరకూ నగరంలోని సెయింట్ ఆంథోనీ ప్రైమరీ స్కూల్ వేదికగా జరిగిన మూడు రోజుల విశాఖ బాలోత్సవం పిల్లల్లో అంతే గొప్ప ఊపును, ఉత్సాహాన్ని తెచ్చిందంటే ఆశ్చర్యం కలుగక మానదు. అంతేకాదు వారిలో సామాజిక స్పృహను పెంచే అకడమిక్ (క్విజ్ పోటీలు, ఏకపాత్రాభినయాలు), ఉత్సాహాన్ని నింపే సాంస్కృతిక కార్యక్రమాల మేళవింపు వారిలో దాగివున్న సృజనాత్మకత, అద్భుత నైపుణ్యాలను వెలికితీశాయంటే అతిశయోక్తికాదు. ఈ మూడు రోజులూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ మిగతా 2లో..



ఆకట్టుకున్న విద్యార్థుల ప్రదర్శన

తాత్కాలిక డిఆర్ఎంగా మనోజ్ కుమార్ సాహూ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : వాల్తేరు డివిజన్ ఎడిఆర్ఎం మనోజ్ కుమార్ సాహూ ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేరు డివిజన్ తాత్కాలిక డివిజనల్ రైల్వే మేనేజర్గా గురువారం బాధ్యతలు స్వీకరించారు. మనోజ్ కుమార్ సాహూ బుర్లాలోని వీర్ సురేంద్ర సాయి యూనివర్సిటీ ఆఫ్ టెక్నాలజీ నుంచి బిఇ/ఎలక్ట్రికల్లో గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఉత్కల్ యూనివర్సిటీ నుంచి పిజిడి హెచ్ఆర్ఎం, ఆంధ్రా యూనివర్సిటీ నుంచి ఎంబిఎ చేశారు. రైల్వేలో 26 సంవత్సరాలకుపైగా అనుభవం కలిగి ఉన్నారు. సౌత్ ఈస్ట్ సెంట్రల్ రైల్వే, సౌత్ ఈస్టర్న్ రైల్వే, ఈస్ట్కోస్ట్ రైల్వేల్లో వివిధ హోదాల్లో పనిచేశారు. కొద్ది రోజుల క్రితం వాల్తేరు డిఆర్ఎం సౌరభ్ ప్రసాద్ ముంబయిలో ఓ వ్యక్తి నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ సిబిఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో తాత్కాలిక డిఆర్ఎంగా మనోజ్ కుమార్ సాహూను నియమిస్తూ రైల్వే ఉన్నతాధికారులు నిర్ణయం తీసుకున్నారు.

అవినీతికి పాల్పడిన ఇద్దరు పోలీసులపై వేటు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం పోలీస్ కమిషనరేట్ పరిధిలో మూడో పట్టణ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లో అటాచ్మెంట్పై విధులు నిర్వహిస్తున్న ద్వారకా ట్రాఫిక్ స్టేషన్కు చెందిన టిఎస్ఐ ఎన్వి భాస్కరరావు, ద్వారకా ట్రాఫిక్ స్టేషన్ రైటర్గా విధులు నిర్వహిస్తున్న కానిస్టేబుల్ సిహెచ్.జయరావులపై సస్పెన్షన్ విధిస్తూ నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం సాయంత్రం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల కాలంలో డ్రంక్ అండ్ డ్రైవ్ స్పెషల్ డ్రైవ్లో పట్టుబడిన ఒక వ్యక్తిని కేసు నుంచి తప్పించేందుకు నగదును లంచంగా తీసుకుని కేసును కోర్టులో ప్రవేశపెట్టకుండా నిర్లక్ష్యం చేశారని పోలీస్ కమిషనర్ దృష్టికి రావడంతో ఆయన విచారణ చేపట్టారు. అనంతరం వారి ఇరువురినీ క్రమశిక్షణా చర్యలలో భాగంగా విధుల నుంచి తొలగించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరూ వ్యవహరించరాదన్నారు.

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు వద్దు : సిపిఎం

వార్త 5లో..

విశాఖ డెయిరీ కార్మికులచే వెట్టిచాకిరీ

వార్త 4లో..

'స్టీల్' వేతనాల కోసం నేడు ధర్నా

వార్త 4లో..

బాదంగీర్ సాయి కన్నుమూత



బాదంగీర్ సాయి (ఫైల్ ఫొటో)

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రముఖ నాటక రచయిత, రంగసాయి నాటక సంఘం, రంగసాయి నాటక గ్రంథాలయం వ్యవస్థాపకులు ఎవిఎస్.మూర్తి (బాదంగీర్ సాయి) గురువారం సాయంత్రం ఆరు గంటల సమయంలో తుది శ్వాస విడిచారు. విశాఖలో ఉంటున్న ఆయన కొంతకాలంగా బ్రెయిన్ హ్యామరేజ్ సమస్యలతో బాధపడుతున్నారు. గురువారం సాయంత్రం ఆయన ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మురళీనగర్లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. నాటక కళాకారుడైన బాదంగీర్ సాయి నటనతో సరిపెట్టుకోకుండా నాటక వికాసానికి కూడా తన వంతు కృషి చేసేందుకు నిరంతరం తపిస్తూ నాటక ప్రదర్శనలకు శ్రీకారం చుట్టారు. దేశ, విదేశాల్లో ప్రసిద్ధిగాంచిన సురభి నాటకాలను విశాఖలో 40 రోజులపాటు ప్రదర్శింపజేశారు. అదే విధంగా విశిష్ట ప్రేక్షకాదరణ పొందిన అనేక నాటకాలను విశాఖ నగరంలో ప్రదర్శింపజేస్తూ 2010లో ఏర్పాటు చేసిన రంగసాయి నాటక సంఘం ద్వారా విశేష కృషి చేశారు. మరుగునపడిన కళాకారుల ప్రదర్శనలు ఏర్పాటు చేయడంతో పాటు వారిని ఘనంగా సత్కరించే కార్యక్రమాలను తెలుగు నాటక రంగ దినోత్సవం, ప్రపంచ నాటక రంగ దినోత్సవం సందర్భంగా ఏటా నిర్వహిస్తూ వచ్చారు. నాటకం అనేక సామాజిక వాస్తవాల విభిన్న దర్పణమని, నేటికీ అధునాతన కళలకు చోదక శక్తిని అందించే రంగమని, అలాంటి నాటక సృజనను రానున్న తరాలకు అందివ్వాలని భావించి నాటక పుస్తకాల సేకరణ ప్రారంభించి 2011లో దొండపర్తి జంక్షన్లో ఒక అద్దె గృహంలో రంగసాయి నాటక గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. 500 నాటక పుస్తకాలతో ఏర్పాటైన ఈ గ్రంథాలయం నిర్వహణ, మిగతా 2లో..

సముద్ర సంపదను కాపాడుకోవాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సముద్రంలో ఉన్న మత్స్య సంపదను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యతని జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా గురువారం భారతీయ మత్స్య పరిశోధన సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మత్స్యకార సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సముద్ర మత్స్య సంపద పరిరక్షణ, నిర్వహణ, సాంప్రదాయ మత్స్యకారుల జీవనోపాధి కాపాడటం మొదలగు అంశాలపై అవగాహన కల్పించారు. విశాఖ జిల్లాలో 32 తీర గ్రామాలు, 15 ఫిష్ ల్యాండింగ్ కేంద్రాలు ఉన్నాయని తెలిపారు. మత్స్యకార బోట్లకు వంద శాతం సబ్సిడీతో ట్రాన్స్పాండర్లను అందజేస్తున్నామన్నారు. సుమారు రూ.178 కోట్లతో ఫిషింగ్ హార్బర్ ఆధునికీకరణ పనులు చేపడుతున్నామన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద ఫిష్ స్టాళ్లను ఏర్పాటు చేయడం, చేపల రవాణా వాహనాలు, ఫిష్ కేజ్ కల్చర్ యూనిట్స్ను మంజూరు చేయడం వంటివి చేపడుతున్నామన్నారు. బోట్లు ఫిట్నెస్ను ఎప్పటికప్పుడు చెక్ మిగతా 2లో..

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

- ప్రభుత్వాన్ని కోరిన పిడిఎఫ్ సభ్యులు కెఎస్.లక్ష్మణరావు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

హైకోర్టు బెంచ్ను కర్నూలులో ఏర్పాటు చేస్తూ శాసన మండలిలో పెట్టిన తీర్మానాన్ని బలపరుస్తున్నామని, అదే సమయంలో ఉత్తరాంధ్ర ప్రాంతానికి మేలు చేసే విధంగా విశాఖలోను మరో బెంచ్ ఏర్పాటు చేయాలని పిడిఎఫ్ సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు ప్రభుత్వాన్ని కోరారు. శాసన మండలిలో న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్ ప్రవేశపెట్టిన ఎపి ఉన్నత న్యాయస్థానం ధర్మాసనాన్ని హైకోర్టులో ఏర్పాటు చేయాలనే తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా జరిగిన చర్చల్లో సభ్యులు కె.ఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ...పెద్ద రాష్ట్రాల్లో రెండు బెంచ్లు ఏర్పాటు చేశారని తెలిపారు. విశాఖలో బెంచ్ ఏర్పాటు అంశాన్ని పరిగణలోకి తీసుకోవాలని కోరారు. సభ్యులు వై.శివరామిరెడ్డి మాట్లాడుతూ సిబాగ్ ఒప్పందం ప్రకారం కర్నూలులో హైకోర్టును ఏర్పాటు చేయాల్సి ఉందని, బెంచ్ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం చేతులు దులుపుకుంటుందని చెప్పారు. సభ్యులు రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ... గత ప్రభుత్వం హై కోర్టును కర్నూలులో ఏర్పాటు చేస్తామంటే అడ్డుకున్నది టిడిపి నాయకులేనన్నారు. ఎం.వి రామచంద్రారెడ్డి మాట్లాడుతూ... కర్నూలులో న్యాయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు 243 ఎకరాలు కేటాయించడం జరిగిందని, దీని నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని కోరారు. ఈ సందర్భంగా సభ్యులు రాంగోపాల్ రెడ్డి, నాయుడు, అరుణ్కుమార్ తదితరులు ప్రసంగించారు.

కర్నూలులో హైకోర్టు ఏర్పాటు చేస్తామన్న ప్రభుత్వం గత ఐదేళ్ల కాలంలో వైసిపి ప్రభుత్వం కనీసం ప్రతిపాదనలు కూడా సమర్పించలేకపోయిందనివైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ అన్నారు. ప్రతిపాదన లేకుండా హై కోర్టు దానంతట అదే తరలిపోతుందా అని ప్రశ్నించారు. ఇది కర్నూలు ప్రజలకు పండుగ వంటిదని మంత్రి టి.జి భరత్ తెలిపారు. సిబాగ్ ఒప్పందం ప్రకారం బెంచ్ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

విశాఖలో హైకోర్టు బెంచ్ ఏర్పాటు

ఏర్పాటు చేయడం చంద్రబాబుతో సాధ్యమవుతుందన్నారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు రాయలసీమకు వైసిపి హయాంలో ఏం అభివృద్ధి చేశారని మంత్రి ప్రశ్నించారు. ఇచ్చిన మాట ప్రకారం ప్రభుత్వం హై కోర్టు బెంచ్ కర్నూలులో ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేసి తదుపరి చర్యల కోసం హై కోర్టుకును కోరుతున్నట్లు చెప్పారు. అక్కడ ఏర్పాటు చేసిన ఎపిఇఆర్సి, మనవ హక్కుల కమిషన్ కార్యాలయం, ఇతర కార్యాలయాలను తరలించేది లేదని మంత్రి స్పష్టం చేశారు. న్యాయశాఖ మంత్రి ఎన్.ఎండి ఫరూక్ మాట్లాడుతూ రాష్ట్ర తొలి రాజధాని కర్నూలుకు పూర్వవైభవం రానుందని, హై కోర్టు బెంచ్ ఏర్పాటు చేయడాన్ని సీమ ప్రజలు స్వాగతిస్తున్నారని చెప్పారు.

బాదంగీర్ సాయి కన్నుమూత

ఆర్థిక భారం కావడంతో జివిఎంసి సహకారంతో టిఎస్ఆర్ కాంప్లెక్స్ పై భాగంలో ఈ గ్రంథాలయాన్ని ఏర్పాటు చేశారు. ప్రస్తుతం అందులో 10 వేల 500కు పైగా నాటక గ్రంథాలు ఉన్నాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇది తొలి నాటక గ్రంథాలయంకాగా, దీనిని దేశంలోని తొలి నాటక గ్రంథాలయంగా అభివృద్ధి చేయాలని తాను ప్రేమించే నాటక రచనలను నిక్షిప్తం చేసేందుకు ఏడు సంవత్సరాలపాటు నాటక గ్రంథాలను నటులు, నాటక రచయితలు, సంస్థలను అర్థిస్తూ విలువైన సమాచారాన్ని సేకరించారు. ఆయన మృతి చెందారని తెలుసుకున్న కళాకారులు, రచయితలు, ప్రముఖులు సంతాపం వ్యక్తం చేశారు.

బాదంగీర్ సాయి మరణం విచారకరం : అజశర్మ

ప్రముఖ కళాకారుడు బాదంగీర్ సాయి మరణం తీవ్ర విచారకరమని ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ పేర్కొన్నారు. గురువారం సాయంత్రం విడుదల చేసిన ఓ ప్రకటనలో ఈ మేరకు సంతాపం వ్యక్తం చేశారు. సాయి నిగర్వి, నిరాడంబరుడు అని పేర్కొన్నారు. ఆయన మరణంతో విశాఖ ఒక ప్రముఖ కళాభిమానిని కోల్పోయిందన్నారు. ప్రాచీన కళలు, నాటకాలంటే ఆయన గొప్ప ఆసక్తి చూపేవారని, నాటక పుస్తక గ్రంథాలయం ఏర్పాటు చేసి అందులో రిహార్సల్స్ కూడా నిర్వహించేవారని తెలిపారు. ఆయన తన రంగసాయి సంస్థ ద్వారా విశాఖ నగరంలో అనేక కళా ప్రదర్శనలు ఏర్పాటు చేశారని, అంతరించిపోతున్న కళలను పునఃప్రతిష్ఠించడానికి విశేష కృషి చేశారని కొనియాడారు. ముఖ్యంగా సురభి నాటకాలను విశాఖలో ప్రదర్శించడానికి ప్రత్యేక చొరవ చూపారన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు అజశర్మ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సముద్ర సంపదను కాపాడుకోవాలి

చేసుకోవాలని మత్స్యకారులకు సూచించారు. ఇందువల్ల సముద్రంలో అనేక ప్రమాదాలను నివారించుకోవచ్చని తెలిపారు. కార్యక్రమంలో మెరైన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రవివర్మ, మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ పి.లక్ష్మణరావు, భారతీయ మత్స్య పరిశోధన సంస్థ ముఖ్య అధికారి డి.బామిరెడ్డి, శాస్త్రవేత్త జివిఎ.ప్రసాద్, జివిఎంసి అడిషనల్ కమిషనర్ రమణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా మత్స్యకార దినోత్సవం

భీమునిపట్నం : జివిఎంసి నాలుగో వార్డు పరిధి చేపలుప్పాడ, చొక్కవానిపాలెంలో శ్రీ ఉత్తరాంధ్ర మత్స్యకారుల అభివృద్ధి సంక్షేమ సేవా సంఘం ఆధ్వర్యాన గురువారం మత్స్యకార దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకార నాయకులు మాట్లాడుతూ, మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను కోరారు. రసాయన, ఫార్మా పరిశ్రమల ఏర్పాటుకు మన రాష్ట్రంలో అనుమతులు ఇవ్వడం వల్ల తీరప్రాంతంలో మత్స్య సంపద కోల్పోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. తుపాను వచ్చే సందర్భంలో పంట నష్ట పోయిన రైతులకు నష్ట పరిహారం ఇచ్చి ఆదుకుంటున్న మాదిరిగానే, బాధిత మత్స్యకారులను కూడా ఆదుకోవాలని ప్రభుత్వాలను కోరారు. సమస్యల పరిష్కారానికి ఐక్యంగా ఉండాలని మత్స్యకారులకు పిలుపునిచ్చారు. సంఘం అధ్యక్షులు చొక్కా భాస్కరరావు అధ్యక్షతన జరిగిన సభలో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, మత్స్యకార నాయకులు కోలా గురువులు, పేర్ల విజయ్‌చందర్, కె.ఎర్రయ్య, కారి అప్పారావు, వాసుపల్లి నల్లబాబు, వాసుపల్లి ఎల్లయ్య, మారుపిల్లి అమర్‌నాథ్, దూడ అచ్చిరావు తదితరులు మాట్లాడారు. అనంతరం పేద మహిళలకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచి పెట్టారు.

విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వం మత్స్యకారులకు అండగా నిలవాలని అఖిల భారత మత్స్య కార్మిక సంఘం జాతీయ అధ్యక్షులు జెవి.సత్యనారాయణమూర్తి అన్నారు. ప్రపంచ మత్స్యకారుల దినోత్సవం సందర్భంగా అల్లిపురం మహాత్మా గాంధీ మార్కెట్ వద్ద విశాఖ జిల్లా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు.

మత్స్యకార దినోత్సవం సందర్భంగా పలువురు మత్స్యకారులు, వైసిపి కార్యకర్తలు ఆశీలుమెట్ట కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ను కలిసి అభినందించి, భారీ చేపను బహుమతిగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో మత్స్యకారులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు.

24న మానవ హక్కుల వేదిక జిల్లా మహాసభ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మానవ హక్కుల వేదిక జిల్లా 9వ మహాసభ ఆదివారం ఉదయం 10 గంటలకు ద్వారకానగర్ విశాఖ పౌర గ్రంథాలయంలో జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా విశాఖలో పర్యావరణ విధ్వంసం, మన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ఎలా చంపేస్తున్నారు ? అన్న అంశాలపై ప్రముఖులు ప్రసంగిస్తారని పేర్కొన్నారు.పరిశ్రమల్లో మరణ మృదంగం అంశంపై మానవ హక్కుల నివేదికను విడుదల చేస్తామని తెలిపారు.

ఆటోలో 20 మంది పిల్లలు

- డ్రైవర్‌కు రూ.10 వేలు జరిమానా

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పరిమితికి మించి 20 మంది పిల్లలను తీసుకువెళ్తున్న ఆటోను గురువారం పూర్ణా మార్కెట్ దుర్గాలమ్మ గుడి వద్ద ట్రాఫిక్ సిఐ శ్రీనివాసరావు, ఎస్ఐ విశ్వనాథం వాహన తనిఖీలు సందర్భంలో గుర్తించి పట్టుకున్నారు. ఆటో డ్రైవర్‌కు రూ.10 వేల జరిమానా విధించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు తప్పవన్నారు.

జివిఎంసి పిజిఆర్ఎస్ నమోదు కౌంటర్ల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : మహా విశాఖ నగరపాలక సంస్థలో ప్రతి సోమవారం నమోదవుతున్న ప్రజా వినతులు, ఫిర్యాదుల విషయమై పూర్తి వివరాలతో క్లుప్తంగా నమోదు ప్రక్రియ జరగాలని జివిఎంసి అదనపు కమిషనర్ డివి.రమణమూర్తి అన్నారు. గురువారం ఆయన అదనపు కమిషనర్ ఆర్.సోమన్నారాయణతో కలిసి జివిఎంసి ప్రధాన కార్యాలయంలోగల పిజిఆర్ఎస్ నమోదు కేంద్రాన్ని పరిశీలించారు.

ఉత్సాహం, ఉత్తేజం.. విశాఖ బాలోత్సవం

(మొదటి పేజీ తరువాయి..) శాస్త్రీయ, జానపద, ప్రాశ్చాత్య నృత్యాలు, సామాజిక స్పృహను పెంచే లఘునాటికలు, కవితలు, దేశభక్తిని పెంపొందించేలా అల్లూరి సీతారామరాజు, చాచా నెహ్రూల ఏకపాత్రాభినయాలతో బాలలు అలరించారు.

పిల్లల్లో సరికొత్త ఆలోచనాశక్తి రేకెత్తించిన 'బాలోత్సవం'

పిల్లలే శాస్త్రవేత్తలైతే సమాజానికి ఏం చేస్తారు ? అదుపు తప్పిన కృత్రిమ మేధ (ఎఐ టెక్నాలజీ) వల్ల లాభ, నష్టాలెలా ఉంటాయి? 'రోబో' ఏం చేస్తోంది? తాగుడు, డ్రగ్స్, గంజాయిలకు అలవాటు పడితే యువత భవిష్యత్ ఏమిటి? రుషికొండపైగల భవనాలను సైన్స్ మ్యూజియం కోసం వినియోగిస్తే లాభాలేమిటి ? పర్యావరణాన్ని ఎలా పరిరక్షించాలి ? మూఢనమ్మకాలపై ఎలా పోరాడాలి ? రైతుల కష్టాల నుంచి గట్టెక్కించే మార్గాలేమిటి ? వంటి అనేక ఆలోచింపజేసే అంశాలపై కవితలు, లఘునాటికలు గడచిన మూడు రోజుల్లో సాగాయి. విశాఖపట్నం జిల్లా నలుమూలల సుమారు 120 ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు నుంచి హాజరైన విద్యార్థినీ విద్యార్థులు తమ ఆలోచనలకు పదును పెట్టారు. ఎంతో మంచి వేదికను బాలోత్సవం కల్పించిందని, తాము ఎంతగానో ఎంజాయ్ చేశామని బాల, బాలికలు గురువారం 'బాలోత్సవం' ముగింపు రోజున స్పందించారు. వారి మాటల్లో పండగ వాతావరణం



విద్యార్థికి బహుమతి అందజేస్తున్న సోమేశ్వరరావు

కనిపించింది.

4 స్టేజీలు ఏర్పాటు.. రోజుకు 32 ఈవెంట్లు

విశాఖ జిల్లా నలుమూలల నుంచి ప్రభుత్వ, ప్రైవేట్ స్కూల్స్‌లో 2వ తరగతి నుంచి 10వ తరగతి వరకూ చదువుకునే బాల, బాలికలు సుమారు 8 వేల మంది ఈ నెల 19 నుంచి 21 వరకూ 32 ఈవెంట్లలో పాల్గొన్నారు. 100 మంది ఏయూ, విజయవాడ, ఢిల్లీ స్థాయిలో పనిచేస్తున్న ప్రొఫెసర్లు సైతం బాలోత్సవంలో పోటీలను స్వయంగా తిలకించి జడ్జీలుగా వ్యవహరించి విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా పిల్లల్లో అద్భుత నైపుణ్యాలను వెలికితీసినట్టయిందంటూ పలువురు జడ్జిలు ప్రజాశక్తికి వెల్లడించారు. టీవీలు, సెల్‌ఫోన్‌ల దాడి పిల్లలపై ఉన్నా వాటన్నిటినీ అధిగమించి లఘునాటికలు, క్విజ్ పోటీలు, ఏకపాత్రాభినయాల్లో క్రమశిక్షణతో సామాజిక మేధోశక్తిని బాల, బాలికలంతా ప్రదర్శించడం గొప్ప విషయమంటూ కొనియాడారు.

సీనియర్లు, జూనియర్లు, సబ్ జూనియర్లుగా పిల్లలను విభజించి లఘునాటికలు, పాటలు, జానపద, శాస్త్రీయ, ప్రాశ్చాత్య నృత్యాల కోసం 4 స్టేజీలను నిర్వాహకులు ఏర్పాటు చేశారు. 27 రకాల ఈవెంట్లలో పిల్లలంతా పాల్గొన్నారు.

పిల్లల్లో సామాజిక స్పృహ పెంచేవే ఈవెంట్లు : విశాఖ బాలోత్సవం ఉపాధ్యక్షులు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ

బాల, బాలికల్లో సామాజిక స్పృహ పెంచే అంశాలనే పోటీ ఈవెంట్లుగా పెట్టడం వల్ల వారిలో సృజనాత్మకత బయటపడిందని విశాఖ బాలోత్సవం ఉపాధ్యక్షులు డాక్టర్ కొరెడ్ల రమాప్రభ అన్నారు. లఘునాటికల్లో అద్భుతమైన ప్రతిభను పిల్లలు కనబర్చారని, స్నేహం, సమాజం గురించి మాట్లాడడం, వార్తా రచనలో సామాజిక విశ్లేషణలపైనా పోటీలు జరిగాయన్నారు.

సాంస్కృతిక ఉత్సాహం నిండిన బాలోత్సవం : దండు నాగేశ్వరరావు

'విశాఖ బాలోత్సవం' పిల్లల్లో అభ్యుదయ ఆలోచనలను రేకెత్తించిందని, సాంస్కృతిక వికాసం, ఉత్సాహాన్నిచ్చిందని బాలోత్సవ నిర్వాహకుల్లో ఒకరైన దండు నాగేశ్వరరావు ప్రజాశక్తికి వెల్లడించారు. స్కూళ్ల నుంచి పిల్లలను టీచర్లు తమ వెంట తీసుకు వచ్చారని, వీరితో తల్లిదండ్రులూ ఉండి ఎంతో క్రమశిక్షణతో ఈవెంట్లలో పాల్గొనడంతో పండగలా ఉత్సవం జరిగిందన్నారు.

తోపుడు బండ్లు, చిల్లర వర్తకుల ధర్నా



ర్యాలీ నిర్వహిస్తున్న చిల్లర వర్తకులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్, ఎంవిపి.కాలనీ : 22వ వార్డు పిఠాపురం కాలనీ ప్రాంతంలోని సోమవారం సంత, బడ్డీలు, తోపుడు బండ్లు తొలగింపునకు వ్యతిరేకంగా గురువారం కళాభారతి నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు 120 మందితో సిఐటియు ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. తోపుడుబండ్లు కార్మిక సంఘం (సిఐటియు) మద్దిలపాలెం జోన్ గౌరవాధ్యక్షులు పి.వెంకటరావు ఈ సందర్భంగా మాట్లాడుతూ తొలగించిన తోపుడు బండ్లు, చిల్లర వర్తకులను యధావిధిగా కొనసాగించాలని, సోమవారం సంత కొనసాగించాలని జివిఎంసి అధికారులను డిమాండ్ చేశారు. వార్డు కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్ చిల్లర వర్తకులపై కక్ష సాధింపుతో హైకోర్టు నుంచి బడ్డీలు, తోపుడు బండ్లను తొలగించడానికి ఆర్డర్ తీసుకువచ్చి, వారిపై దాడి చేయడం అన్యాయమన్నారు. 2014 స్ట్రీట్ వెండర్స్ యాక్ట్ ఉండగా నోటీసు లేకుండా తెల్లవారు నాలుగు గంటల సమయంలో తోపుడు బండ్లను తొలగించి, బడ్డీలను నామరూపాలు లేకుండా చేయడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో తోపుడు బండ్ల కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఎ.సింహాచలం, సిఐటియు సీనియర్ నాయకులు అనపర్తి అప్పారావు, కె.కుమారి, పిఠాపురం కాలనీ తోపుడుబండ్లు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు బన్నీ, నిషా పాల్గొన్నారు.

పబ్లికేషన్

మహారాజశ్రీ బొబ్బిలి ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జికోర్టు వారి దివ్యసముఖమునకు

O.S.1/2024

బిట్విన్ :
యాళ్ల అప్పారావు ....వాది
ఎండ్:
తమ్మినేని రాజా వేణుగోపాల క్రిష్ణ (ఎలియాస్) రాజు ......ప్రతివాది

To,
తమ్మినేని రాజా వేణుగోపాల క్రిష్ణ, తండ్రి గోవిందరావు, వయస్సు 39 సం॥లు., ప్లాటు నెం.4, దేవాలయ వెంచిరీన్, సి1 జోన్, ఏరియాపార్కు, సుజాత నగర్, పెందుర్తి, విశాఖపట్నం జిల్లా.

పై నెంబరు దావాలోని యిందలి ప్రతివాదిపై సొమ్ము రాబట్టే నిమిత్తం దావా దాఖలు చేసి యున్నారు. సదరు దావా వాయిదా **తేది.03-12-2024**కి వాయిదా అయి వున్నది. సదరు వాయిదా దినం పై కోర్టులో **ఉదయం 10.30 గం॥**లకు స్వయంగా గాని వకీలు ద్వారా గాని పైకోర్టులో హాజరు కావలెయును లేని యెడల మీ పరోక్షమందు తీర్మానించ బడునని యిందు మూలంగా తెలియజేయడమైనది.

బై ఆర్డర్
కందాపు ప్రసాదరావు
వాది తరుపు అడ్వకేట్
బొబ్బిలి

బొబ్బిలి,
తేది: 21-11-2024

IN THE HON'BLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION-II AT: VISAKHAPATNAM
C.C.2/2024

Between:
Balla Jyothi & others ... Complainants
And:
M/s.Sree Satya Balaji Constructions, Rep. by its Managing Partner Sri Gudla Venkata Satyanarayana & another
...Opposite Parties

NOTICE

To,
OP. No.1: M/s.Sree Satya Balaji Constructions, Rep. by its Managing Partner Sri Gudla Venkata Satyanarayana, Office at Flat No. FF-1, V.S.N.R. Enclave, ASR Nagar, Seethammadhara, Visakhapatnam-13.
OP. No.2: Sri Gudla Venkata Satyanarayana, S/o. late Madhava Rao, Hindu, aged 51 years, R/at Flat No.502, Vighnesh Enclave, Venkataraju Nagar, Dondaparthy, Visakhapatnam.

Please take notice that the above named Complainants filed the above case against you for grant of compensation and for unfinished works in the Apartment and the matter stands posted to **06-12-2024** for your appearance before the Hon'ble **District Consumer Disputes Redressal Commission-II** at VUDA Complex, Siripuram, Visakhapatnam at **10:30 A.M.**, either yourself in person or any person authorized by you, failing which the Hon'ble Commission will proceed with the matter as per law.
(By Order of the Hon'ble Commission-II)
N. VASANTH KUMAR,
Advocate, Visakhapatnam.
Cell: 9948161072.

IN THE HON'BLE COURT OF THE V ADDL. JUNIOR CIVIL JUDGE AT: VISAKHAPATNAM
O.S.1347/2023

Between:
UNION BANK OF INDIA, (e-Andhra Bank) **A.U. Campus Branch,** Visakhapatnam, Rep. by its Branch Manager
...Plaintiff
And:
Sri Dhanala Mohan Rao, S/o. D.Durgayya ...Defendant

SUMMONS

To, **The Defendant:**
Sri Dhanala Mohan Rao, S/o. D.Durgayya, Hindu, aged 47 years, R/at D.No.8-67-39/4, A.U. Quarters Class-4, A-4, Near Nagarjuna Hostel, Vidya Nagar, Visakhapatnam-03.

Please take notice that the above O.S.1347/2023 filed by the plaintiff against you for recovery of an amount of Rs. 2,46,601-10ps and the matter stands posted to **28-11-2024** for your appearance on that day **10:30 A.M.** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be heard and determined in your absence, ex-parte as per law.
(By Order of the Hon'ble Court)
N. SUVARNA RAJU,
Advocate, Visakhapatnam,
Cell: 98485 50336.

యాంటీబయాటిక్‌ల వినియోగంలో జాగ్రత్త అవసరం

ప్రజాశక్తి -మధురవాడ : యాంటీబయాటిక్స్‌ను అవసరానికి మించి వినియోగించడం వల్ల ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని, వాటి వినియోగంలో జాగ్రత్త అవసరమని ఫార్మాకాలజీ నిపుణుడు డాక్టర్ ఎ.శ్యామ్‌కుమార్ సూచించారు. యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ (ఎఎమ్‌ఆర్) అవగాహన వారోత్సవాలలో భాగంగా గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్‌సర్), గీతం స్కూల్ ఆఫ్ ఫార్మశీ ఆధ్వర్యాన గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. మితిమీరిన యాంటీబయాటిక్స్ వినియోగం వల్ల సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. ఈ విషయంలో ప్రజారోగ్యం దృష్ట్యా యాంటిబయాటిక్స్‌ను బాధ్యతగా ఉపయోగించాల్సి ఉందన్నారు. ఎఎమ్‌ఆర్ సమస్యపై ప్రజలను, ఆరోగ్య కార్యకర్తలకు చైతన్యం కలిగించడానికి అవగాహన వారోత్సవాలు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో స్కూల్ ఆఫ్ ఫార్మశీ డీన్ ప్రొఫెసర్ జగత్తరన్ దాస్, ప్రొఫెసర్ పి.రామారావు, జిమ్‌సర్ ఫార్మకాలజీ విభాగాధిపతి డాక్టర్ టి.తులసిమాధురి, ఫార్మశీ విద్యార్థులు పాల్గొన్నారు.



యాంటీమైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాలలో గీతం ప్రతినిధులు, విద్యార్థులు

కార్మిక నేత శంకరరెడ్డి సేవలు మరువలేనివి

ప్రజాశక్తి -తగరపువలస : చిట్టివలస జ్యూట్ కార్మికులహక్కుల కోసం ఎన్నో పోరాటాలు చేసిన చిల్ల శంకర రెడ్డి సేవలు మరువలేనివని పలువురు కార్మిక సంఘం నాయకులు కొనియాడారు. స్థానిక కాకాస కార్యాలయంలో గురువారం కార్మిక నేత శంకర రెడ్డి వర్థంతి నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళు లర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షులు జెవి.కైలాష్‌రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దల్లి అప్పలరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎం.ఆదినారాయణరెడ్డి, గొండేల అప్పారావు, జనసేన నాయకులు నీలాపు శంకరరెడ్డి, వైసిపి నాయకులు సిహెచ్.భాస్కరరెడ్డి పాల్గొన్నారు. చిల్ల పేట గ్రామంలో ఉన్న ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : శ్రీ సత్యసాయి జయంతిని పురస్కరించుకొని తునివలస భజన మండలి ఆధ్వర్యాన మండలంలోని తునివలస గ్రామంలో 70 మంది నిరుపేద వృద్ధులకు గురువారం దుప్పట్లు పంపిణీ చేశారు. జయంతి నేపథ్యంలో నగర సంకీర్తన, దీపాలతో ఊరేగింపు, వేదం, లలితా సహస్రనామం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తునివలస సత్యసాయి కమిటీ సభ్యులు మోహన్‌సాయి, కోటేశ్వరరావు, సూర్యం, పూర్ణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం, మధురవాడ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు కారణంగా శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జోన్- 3 డిఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఎపిహెచ్‌బి కాలనీ, ఆర్‌హెచ్.కాలనీ, ఎఫ్‌సిఐ లే-అవుట్, సుగర్‌కేన్ కాలనీ, మూడో బస్టాపు ప్రాంతం, పిహెచ్‌సి సెంటర్ కొమ్మాది, చైతన్య ఇంజినీరింగ్ కాలేజీ, చైతన్య టెక్నో స్కూల్, కె.2 కాలనీ, కె - కాలనీ, కె.3 కాలనీ, నవోదయ స్కూల్, డిఆర్‌కె టౌన్‌షిప్, అన్నంరాజు నగం, సాయి చంద్ర లే-అవుట్, గాయత్రి కాలేజ్ కో ఎడ్యుకేషన్, అష్టలక్ష్మి టెంపుల్ ప్రాంతాలకు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు సహకరించాలని కోరారు.

ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్‌గా రాధారాణి

ప్రజాశక్తి-సీతమ్మధార : జిల్లా ఆరోగ్యశాఖ రీజనల్ డైరెక్టర్‌గా డాక్టర్ రాధారాణి గురువారం బాధ్యతలు చేపట్టారు. తెలుగు నాడు వైద్య ఆరోగ్య ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ ఆచారి ఆధ్వర్యాన యూనియన్ తరపున కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై గీతంలో సదస్సు

ప్రజాశక్తి -మధురవాడ : గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్, ఇంటర్నేషనల్ సొసైటీ ఆఫ్ వేస్ట్ మేనేజ్‌మెంట్ ఎయిర్ అండ్ వాటర్ సంస్థ సంయుక్తంగా ఈ నెల 28 నుంచి డిసెంబర్ 1వ తేదీ వరకు వ్యర్థాల నిర్వహణ-సర్క్యులర్ ఎకానమిపై అంతర్జాతీయ సదస్సును నిర్వహించనున్నాయని సదస్సు చైర్మన్ ప్రొఫెసర్ సాధన్ కె ఘోష్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ డీన్ ప్రొఫెసర్ రాజా పి.పప్పు తెలిపారు. వివిధ రకాల పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు, పట్టణాలు, రోజువారి జీవితంలో వినియోగించే ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలు, ఆసుపత్రి వ్యర్థాలు తిరిగి వినియోగించే రీసైకిలింగ్ పద్ధతులతో కొత్త ఆర్థిక వ్యవస్థను సృష్టించడాన్ని సర్క్యులర్ ఎకానమి అంటారని వారు తెలిపారు. సస్టైనబుల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ -సర్క్యులర్ ఎకానమీ, ఐపిఎల్ఎ గ్లోబల్ ఫోరమ్ -2024 పేరిట జరిగే ఈ సదస్సులో 60 దేశాల నుంచి 600 మంది ప్రతినిధులు హాజరు కానున్నారని, 580 పరిశోధన పత్రాలను వివిధ రంగాల నిపుణులు సమర్పించనున్నారని తెలిపారు. ఈజిప్ట్, నార్వే, జపాన్, అమెరికా దేశాలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు హాజరై కీలక ఉపన్యాశాలు చేస్తారని తెలిపారు. సదస్సులో భాగంగా ఈ నెల 27వ తేదీన స్కూల్ చిల్డ్రన్ కాంగ్రెస్ నిర్వహిస్తున్నామని, దీనికి దేశంలోని 600 పాఠశాల విద్యార్థులు హాజరు కానున్నారని వెల్లడించారు. వ్యర్థ పదార్థాల నిర్వహణలో సరికొత్త పద్ధతులను, వాణిజ్య సమూనాలను ఉపయోగిస్తున్న పరిశ్రమలకు, స్వచ్ఛంద సంస్థలకు అవార్డులను అందజేస్తామని పేర్కొన్నారు. సదస్సులో భాగంగా పారిశ్రామిక ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుందని తెలిపారు.

5వ వార్డులో జోనల్ కమిషనర్ పర్యటన

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 5వ వార్డు పరిధి శివశక్తినగర్ రోడ్డులో కొండవాలు ప్రాంతాలైన అయ్యప్పనగర్, వివేకానందనగర్, ముత్యాలమ్మకాలనీ, గాంధీనగర్, శివశక్తినగర్ శ్మశానవాటిక, బొట్టవానిపాలెం చెరువు ప్రాంతాలలో వార్డు కార్పొరేటర్ మొల్లిహేమలత, టిడిపి రాష్ట్ర కార్యదర్శి మొల్లి లక్ష్మణరావుతో కలిసి జోనల్ కమిషనర్ పి.సింహాచలం పర్యటించారు. కాలువలు, పార్కులు, కొండవాలు ప్రాంతాల నీటి సమస్య, విద్యుత్, శ్మశాన వాటికలు వాటి సమస్యలు, విద్యుత్, నీటి కుళాయి కనెక్షన్ల కోసం ఇంటి పన్నుల దరఖాస్తుల ఇళ్లను పరిశీలించారు. మాస్టర్ ప్లాన్ రోడ్డులో అక్రమంగా ఏర్పాటుచేసిన బడ్డీలు, శ్మశాన వాటికకు ఆనుకొని ఉన్న బడ్డీలను పరిశీలించారు. స్థానిక సమస్యలపై ఆరా తీశారు. పలు సమస్యలను జోనల్ కమిషనర్‌కు కార్పొరేటర్ మొల్లి హేమలత వివరించారు. ఈ పర్యటనలో ఈఈ శాంతి రాజు, టౌన్ సర్వేయర్ ప్రభాకర్ రావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కాకర శ్రీనివాసరావు, వార్డు-సచివాలయ కార్యదర్శులు పాల్గొన్నారు.



5వ వార్డులో పర్యటిస్తున్న జోనల్ కమిషనర్ సింహాచలం

విద్యార్థులకు ఉపకార వేతనాలు

ప్రజాశక్తి -తగరపువలస : 2023 -24 విద్యా సంవత్సరంలో అత్యధిక మార్కులు సాధించిన 8వ తరగతి నుంచి పీజీ వరకు చదువుతున్న 112 మంది విద్యార్థులకు భీమిలి మండలం చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన గురువారం రూ.7లక్షలా 69 వేల ఉపకార వేతనాలు అందజేశారు. భీమిలి మండలం అన్నవరం, చిప్పాడ, మూలకుద్దు, టి.నగరపాలెం, పెద నాగమయ్యపాలెం, భోగాపురం మండలం లింగాల వలస, తూడెం, చెరుకుపల్లి పంచాయతీలకు చెందిన ప్రతిభ గల విద్యార్థులు ఉపకార వేతనాలు పొందిన వారిలో ఉన్నారు. సంస్థ కార్యాలయంలో ఈ మేరకు డైరెక్టర్ ఎస్.దేవేందర్, వైస్ ప్రెసిడెంట్ ఎల్‌వి.రమణ, జనరల్ మేనేజర్లు ఎంఎస్ఎన్.రావు, ఇ.రామకృష్ణ, వైఎస్.కోటేశ్వరరావు, మార్కెటింగ్ జనరల్ మేనేజర్ నాయుడు చేతుల మీదుగా ఉపకార వేతనాలకు సంబంధించి చెక్కులు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సిఎస్‌ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధులు శ్రీనివాస్, నరసింహ, శేఖర్ బాబు తదితరులు పాల్గొన్నారు.



ఉపకార వేతనాలు పొందిన విద్యార్థులు

నేరాలు ఘోరాలు

బెల్లం క్రషర్‌లో చీర ఇరుక్కుని మహిళ మృతి

ప్రజాశక్తి- కోటవురట్ల: మాకవరపాలెం మండలంలో జంగాలపల్లి గ్రామ రెవిన్యూ పరిధి బెల్లం తయారీ క్రషర్‌లో చీర ఇరుక్కుని కోటవురట్ల మండలం రాజుపేట గ్రామానికి చెందిన శరకం పద్మ (45) గురువారం మృతి చెందింది. చెరుకు బెల్లం పరిశ్రమ వద్ద పని చేస్తున్న ఆమె చెరుకును మిషన్ బెల్టుకు అందిస్తున్న సమయంలో ఆమె చీర కొంగు బెల్టులో చిక్కుకు పోవడంతో మెడకు బిగుసుకొని మృతి చెందినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఆమె భర్త సత్తిబాబు పది సంవత్సరాల క్రితం చనిపోయినట్లు స్థానికులు తెలిపారు. ఇదే క్రషర్ లో ఆమె మూడు సంవత్సరాలుగా పనిచేస్తూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటూ జీవనం సాగిస్తుంది. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి పోలీసులు తరలించారు.

8 మంది జూదరుల అరెస్ట్

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక బీచ్ బస్టాప్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్న 8 మందిని స్థానిక పోలీసులు గురువారం అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. స్థానిక బీచ్ బస్టాప్ వెనుక ఖాళీ ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు వచ్చిన సమాచారం మేరకు సిఐ బొడ్డేపల్లి సుధాకర్ ఆధ్వర్యాన సిబ్బంది ఆకస్మికంగా దాడి చేశారు. 8 మందిని అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.1610 స్వాధీనం చేసుకున్నారు. సిఐ సుధాకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తొమ్మిది చోరీల్లో ముగ్గురు అరెస్టు

21.30 లక్షల నగదు, 188 గ్రాముల బంగారం స్వాధీనం

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ఎలమంచిలి, అచ్యుతాపురం పరవాడ పోలీస్ స్టేషన్లో పరిధిలో 9 చోరీల్లో రూ.21లక్షల నగదు, 188 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకున్నట్టు ఎస్‌పి తుహిన్ సిన్హా వెల్లడించారు. గురువారం స్థానిక పోలీసు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎలమంచిలి పోలీసులు నాలుగు కేసుల్లో రూ.11.30లక్షలు విలువ గల 45 గ్రాముల బంగారు హారం, 4 ద్విచక్ర వాహనాలు, ఒక మొబైల్ ఫోన్ ను స్వాధీనం చేసుకుని, ఇద్దరు నిందితులు అరెస్ట్ చేశామన్నారు. అలాగే అచ్యుతాపురం,పరవాడ పోలీస్ స్టేషన్ల పరిధిలో 5 చోరీ కేసుల్లో సుమారు రూ.10 లక్షల విలువగల 143 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని, ఒకరిని అరెస్టు చేసామన్నారు. ఈ సందర్భంగా పరవాడ అచ్యుతాపురం సిఐలు ఆర్.మల్లికార్జున రావు, ఎన్.గణేష్, సిసిఎస్ సిఐ కె.అప్పలనాయుడు ఎలమంచిలి రూరల్ ఎస్సై ఎం.ఉపేంద్ర, సీసీఎస్ సిబ్బందిని, క్లూస్ టీం, ఐటీ కోర్ సిబ్బందిని జిల్లా ఎస్‌పి తుహిన్ సిన్హా, పరవాడ డిఎస్‌పి కె.వి.సత్యనారాయణ, అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు. మీడియా సమావేశంలో ఎఎస్‌పి క్రైమ్స్ ఎల్.మోహన్ రావు, ఎలమంచిలి సిఐ ఎస్.ధనుంజయరావు, సిసిఎస్ ఎస్ఐలు పి.రమేష్, ఎన్.సత్యనారాయణ, కుమార్, హెచ్.సీ అప్పలరాజు ఎలమంచిలి రూరల్, అచ్యుతాపురం ఎస్ఐలు ఎం.ఉపేంద్ర, అచ్యుతాపురం ఎస్సై కె.సుధాకర్ రావు పాల్గొన్నారు.

దీపోత్సవ నిర్వహణపై నిర్లక్ష్యం

ప్రజాశక్తి -పద్మనాభం : ప్రతి ఏటా ఎంతో ఘనంగా నిర్వహిస్తున్న దీపోత్సవ కార్యక్రమం ఈ ఏడాది జరుగుతుందా లేదా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. రిపోర్ట్స్ నిర్వహణపై సుమారు నెల రోజులు ముందుగానే పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటుచేసి నిర్వహణపై చర్చిస్తారు. ఈ ఏడాది దానికి భిన్నంగా ఈ నెల 30న జరుగనున్న దీపోత్సవ కార్యక్రమానికి ఇప్పటికీ ఒక కార్యక్రమం కూడా జరగకపోవడం, పలు శాఖల అధికారులతో చర్చించకపోవడం భక్తుల్లో ఆందోళన రేకెత్తిస్తోంది. దీపోత్సవం నిర్వహణపై స్థానిక ప్రజాప్రతినిధులు కూడా చాప కింద నీరులా వ్యవహరిస్తున్నారని, ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని భక్తులు ఆరోపిస్తున్నారు. పది రోజులైనా సమయం లేకున్నా నేటికీ ప్రచారం కూడా లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కార్య నిర్వాహణపై సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

ప్రెస్‌క్లబ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -తగరపువలస : ఏడాది కాల పరిమితితో కూడిన స్థానిక ప్రెస్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. ప్రెస్ క్లబ్‌లో సీనియర్ పాత్రికేయులు పి.రాజేంద్ర ప్రసాద్ వర్మ ఆధ్వర్యాన ఎన్నిక జరిగింది. ప్రెస్‌క్లబ్ అధ్యక్షులుగా ఎస్.శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శిగా ఎల్.గణపతిరావు, కోశాధికారిగా ఎ.రోజా, ఆర్గనైజింగ్ సెక్రటరీగా ఎం.రాజు ఎన్నికయ్యారు. ముఖ్య సలహాదారులుగా సీనియర్ పాత్రికేయులు పి.రాజేంద్రప్రసాద్ వర్మ, పి.రంగధామారావు, డివి.చలపతిరావు ఎన్నికయ్యారు.



మంత్రికి వినతిపత్రం అందిస్తున్న కృష్ణంరాజు తదితరులు

పంచగ్రామాల సమస్యపై వినతి

ప్రజాశక్తి-పెందుర్తి : పంచగ్రామాల భూ సమస్యను పరిష్కరించాలని కోరుతూ పంచగ్రామాల సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం ఆధ్వర్యాన రాజధాని అమరావతిలో అసెంబ్లీ సమావేశాలు సందర్భంగా రాష్ట్ర రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్‌కు గురువారం వినతిపత్రం అందజేశారు. 1903 సర్వే సెటిల్‌మెంట్ రికార్డులో ఉన్న రైతులు పేర్లు చూపించి, ఆ రైతులు దగ్గర కొనుక్కున్న స్థలాల్లో ఇళ్లు నిర్మించు కున్నామని, ఆ భూములకు 1996-97లో అప్పటి తహశీల్దార్ సింహాచలం దేవస్థానానికి రైతువారి పట్టాలివ్వడం వల్ల సమస్య వచ్చిందని మంత్రికి సంఘం నాయకులు వివరించారు. దీనిపై మంత్రి స్పందిస్తూ సిసిఎల్‌ఎ సెక్రటరీకి రిఫర్ చేశారని తెలిపారు. సిసిఎల్ సెక్రటరీకి కూడా ఈ సమస్యను వివరించడంతో పరిశీలించి మంత్రికి రిపోర్టు పెడతానని చెప్పినట్లు సంఘం నాయకులు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు, పంచగ్రామాల సమైక్య ప్రజా, రైతు సంక్షేమ సంఘం కార్యదర్శి టివి.కృష్ణంరాజు, అధ్యక్షులు విబిఎన్.ప్రతాప్, వి.హనుమంతురావు, టిఎల్‌జెవి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

కులగణనతో సామాజిక న్యాయం

ప్రజాశక్తి-సీతమ్మధార : దేశంలో కుల గణనతోనే సామాజిక న్యాయం సాధ్యమని దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) రాష్ట్ర అధ్యక్షుడు జెవి.ప్రభాకర్ స్పష్టం చేశారు. నగరంలోరామా టాకీస్ రోడ్డులోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ భవన్‌లో గురువారం ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 23న ఉదయం 10 గంటలకు కులగణన -సామాజిక న్యాయం అంశంపై అంబేద్కర్ భవన్‌లో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ మేరకు సదస్సు ప్రచార కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జెవి.ప్రభాకర్ మాట్లాడుతూ, కులగనణ అంటే కేవలం సంఖ్యా పరమైన లెక్కలు మాత్రమే కాదని ఆయా సామాజిక వర్గాల ఆర్థిక, సామాజిక, విద్యాపరమైన అంశాలన్నీ దాంట్లో ఉంటాయని పేర్కొన్నారు. దీనిద్వారా సామాజిక వర్గాల్లో అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో తెలిస్తే మరింత అభివృద్ధి సాధించడానికి ఏం చేయాలనే స్పష్టత వస్తుందని పేర్కొన్నారు. 2025లో జరగబోయే జనాభా లెక్కల్లో భాగంగా కులాన్ని పట్టికలో చేర్చాలని కోరారు. ఇదంతా జాతీయ ప్లానింగ్ కమిషన్ ద్వారా జరగాలన్నారు. రిజర్వేషన్లను ప్రైవేట్ రంగానికి విస్తరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో డిహెచ్‌పిఎస్ జిల్లా అధ్యక్షుడు గుబ్బల రాంబాబు, కోలా హరిబాబు, దళిత నాయకులు గొడుగు రాజు, అంబేద్కర్ మెమోరియల్ సొసైటీ ప్రతినిధులు బత్తుల గౌతం బాబు, రాజాన సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

2 సెంట్లు ఇళ్ల స్థలాలివ్వాలి

ప్రజాశక్తి-యంత్రాంగం

కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్లు పట్టణాలలో పేదలకు 2 సెంట్లు ఇంటి స్థలం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సిపిఐ ఆధ్వర్యాన గురువారం పలుచోట్ల ప్రదర్శనలు చేశారు.

మధురవాడ : పాతమధురవాడ మెట్ట నుంచి సచివాలయం వరకు పేదలు ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు మాట్లాడుతూ, ధరలు పెరిగిన రీత్యా రూ.5 లక్షలకు పెంచి గృహ నిర్మాణానికి మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వి.సత్యనారాయణ, ఎమ్‌డి బేగం, కె.కుమార్, ఎంఎస్.పాత్రుడు పాల్గొన్నారు.

పెందుర్తి : జివిఎంసి 97వ వార్డు పరిధి సుజాతనగర్ జంక్షన్ నుంచి పాపయ్యరాజుపాలెం 502వ సచివాలయం వరకు ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న నిరుపేదలతో ర్యాలీగా వెళ్లి ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్ శ్రీనివాస్, ఎన్.ఆసిరినాయుడు, ఎ.రమణ, అన్నపూర్ణ, అరుణ, రజని, అప్పలనాయుడు పాల్గొన్నారు.



ప్రదర్శన చేస్తున్న పేదలు

విశాఖ డెయిరీ కార్మికులచే వెట్టిచాకిరీ

సిఐటియు ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి కుమార్

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ డెయిరీ కార్మికులచే యాజమాన్యం వెట్టి చాకిరీ చేయించుకుంటోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ అన్నారు. విశాఖ కో-ఆపరేటివ్ డెయిరీ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన కంపెనీ గేటు పక్కన కార్మికులు చేపట్టిన నిరవధిక రిలే నిరాహార దీక్ష కొనసాగుతోంది. గురువారం నాటి దీక్షను సిఐటియు ఉపాధ్యక్షులు ఎన్.రాజేంద్రప్రసాద్ కార్మికులకు పూలమాలేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ, న్యాయమైన డిమాండ్లను పరిష్కరించకుండా కార్మికులను యాజమాన్యం బానిసలుగా చూస్తోందన్నారు. కార్మికుల హక్కులను అడిగితే కక్ష సాధింపు చర్యలు, బదిలీలు వంటి చర్యలు చేపడుతోందని విమర్శించారు. ఇప్పుడు కార్మికులందరూ ఎర్రజెండా గొడుగు కింద ఉన్నారని, సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు.

సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ, కార్మికుల కష్టానికి తగ్గ వేతనం అడుగుతున్నారు తప్ప, విశాఖ డెయిరీ ఆస్తుల ఆడగటం లేదన్నారు. ఈ నెల 24న అగ్ర నాయకులందరూ వచ్చి డెయిరీ కార్మికుల పోరాటానికి మద్దతు తెలుపుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విశాఖ డైరీ కార్మికులు శనివాడ రమణ, కార్మికులు పాల్గొన్నారు.



దీక్షలో కూర్చున్న విశాఖ డెయిరీ కార్మికులు

‘స్టీల్’ వేతనాల కోసం నేడు ధర్నా



సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

ప్రజాశక్తి -ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులందరికీ తక్షణమే జీతాలు చెల్లించేలా స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఎంపీ శ్రీభరత్ కల్పించుకోవాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు అడ్మిన్ బిల్డింగ్ వద్ద చేపట్టే నిరసన కార్యక్రమంలో కార్మికులందరూ పాల్గొనాలని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి పిలుపునిచ్చారు. యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ అధ్యక్షతన కార్యకర్తల సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ, స్టీల్ యాజమాన్యం ఉద్యోగులకు వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులు పాల్జేయడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. సెప్టెంబర్ నెలకు సంబంధించి 50 శాతం జీతాలు చెల్లించారని, అక్టోబర్ నెలకు సంబంధించి 35 శాతం మాత్రమే జీతాలు చెల్లించారని తెలిపారు. రెండు నెలలు కలిపి 115 శాతం జీతాలు బకాయి ఉన్నాయని, వీటిని తక్షణమే చెల్లించాలని డిమాండ్ చేశారు. జీతాలు అందకపోవడంతో ఉద్యోగులు బ్యాంకు ఇఎంఐలు కట్టలేక అపరాద రుసుం చెల్లించే పరిస్థితి ఏర్పడుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. పిల్లల స్కూలు ఫీజులు చెల్లించాలని దుస్థితి వచ్చిందన్నారు. జీతాల కోసం స్టీల్‌ప్లాంట్ ఉద్యోగుల కుటుంబ సభ్యులు సైతం రోడ్డెక్కాల్సిన పరిస్థితిని యాజమాన్యం కల్పించడం అత్యంత దుర్మార్గం అన్నారు. ఆందోళన తీవ్రతరం కాకముందే ఉద్యోగులందరికీ వేతనాన్ని చెల్లించాలని యాజమాన్యానికి డిమాండ్ చేశారు.

యూనియన్ అధ్యక్షులు వైటి.దాస్ మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ యాజమాన్యం ఉత్పత్తిని పూర్తిస్థాయిలో తీయడంలో వైఫల్యం చెందిందన్నారు. ప్రభుత్వం ప్యాకేజీలు అంటున్నా ఆచరణలో ఏమాత్రమూ ఉపయోగం లేదన్నారు. ఉత్పత్తి పెంచకుండా, ఉద్యోగుల జీతాలు చెల్లించకుండా ప్యాకేజీల పేరుతో ప్రజలను మోసగించడం సరికాదన్నారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు గంగాధర్, పుల్లారావు, నీలకంఠం, శ్రీనివాస్, శ్రీనివాసరాజు, ముత్యాల నాయుడు, సూర్యనారాయణ, అరుణ్ పాల్గొన్నారు.

చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి-వేపగుంట : చిల్లర వర్తకులకు రక్షణ కల్పించాలని కోరుతూ జివిఎంసి జోనల్ కమిషనర్ కార్యాలయం వద్ద సిఐటియు ఆధ్వర్యాన తోపుడు బండ్ల కార్మికులు గురువారం పెద్ద ఎత్తున ధర్నా చేశారు. 2024 తోపుడు బండ్ల వర్తకుల చట్టాన్ని అమలు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. సిఐటియు జోన్ ఉపాధ్యక్షులు కె.అప్పలనాయుడు అధ్యక్షతన జరిగిన ధర్నాలో తోపుడు బండ్ల యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షులు పి.వెంకటరెడ్డి, గోపాలపట్నం జోన్ గౌరవాధ్యక్షులు బి.వెంకట్రావు, సిఐటియు జిల్లా కార్యదర్శి బి.జగన్, ఐద్వా జిల్లా నాయకులు బి.రమణి, జిల్లా నాయకులు మౌలాలి తదితరులు పాల్గొని మాట్లాడారు. గత 20 సంవత్సరాలుగా సుమారు 70 కుటుంబాలు పెందుర్తి రైతు బజార్ వద్ద తోపుడుబళ్లు, నేలపైన, బడ్డీలు పెట్టుకొని చిరువ్యాపారాలు సాగిస్తూ జీవనోపాధి పొందుతున్నారని తెలిపారు. పోలీసుల సహాయంతో జివిఎంసి అధికారులు చిరువ్యాపారస్తులను అక్కడి నుంచి తొలగించడంతో కార్మిక కుటుంబాలు రోడ్డున పడ్డాయని ఆవేదన వ్యక్తంచేశారు. వీరికి తక్షణమే ఉపాధి రక్షణ కల్పించాలని, సుప్రీంకోర్టు గైడ్‌లైన్స్ ప్రకారం హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని కోరారు. 2014 స్ట్రీట్ వెండర్స్ చట్టం ప్రకారం ఎక్కడ చిరువ్యాపారం చేసుకుంటున్నవారికి అక్కడే హాకర్ జోన్ ఏర్పాటుచేసి, వారి ఉపాధికి రక్షణ కల్పించాలని, వారిని వీధివిక్రయదారులుగా గుర్తించి వెండింగ్ కార్డులు ఇవ్వాలని డిమాండ్‌చేశారు. దీనిపై కార్మికులతో జోనల్ కమిషనర్ మాట్లాడారు. తోపుడుబండ్లకు రక్షణ కల్పిస్తాం అని హామీ ఇచ్చారు. హకర్ జోన్ ఏర్పాటుకు కృషి చేస్తామని సిఐటియు నాయకులకు పట్టణ ప్లానింగ్ సహాయ అధికారి రామలింగేశ్వర్ రెడ్డి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ, రెడ్డమ్మ, తార, ప్రభుదాసు, రాజు, మహేష్, అన్నపూర్ణ, మహాలక్ష్మి, ముత్యాలమ్మ తదితరులు పాల్గొన్నారు.



వేపగుంట జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న తోపుడు బండ్ల కార్మికులు

ఉపాధి హామీ పనుల పరిశీలన

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలోని శొంఠ్యాం, కనమాం గ్రామపంచాయతీలో ఎన్ఆర్‌జిఎస్ పనులను ఉపాధి హామీ పథకం డైరెక్టర్ వైవికె.షణ్ముఖకుమార్ సందర్శించారు. ఉపాధి హామీ పనులు, శానిటేషన్, ఊట కుంటలు, ప్లాంటేషన్ వర్క్, మినీ అమృత సరోవర్ చెరువు పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ పూర్ణిమ దేవి, అసిస్టెంట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఆంజనేయులు ఎంపిడిఒ డాక్టర్ వి.జానకి, ఉపాధి హామీ పథకం ఈసి తిరుమలరావు, సిబ్బంది పాల్గొన్నారు.

బాణాలకు జన్మదిన శుభాకాంక్షలు

ప్రజాశక్తి-గోపాలపట్నం : జివిఎంసి వైసిపి ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావుకు వైసిపి మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బాణాల ఇంటికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో బెహరాతో పాటు వైసిపి రాష్ట్ర మహిళా విభాగం ఉపాధ్యక్షులు పేడాడ రమణికుమారి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

93వ వార్డు వైసిపి సమావేశం

ప్రజాశక్తి-వేపగుంట : జివిఎంసి 93వ వార్డు పరిధిలోని నాయకులు, కార్యకర్తలతో రాంపురం కార్యాలయంలో పెందుర్తి మాజీ ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ గురువారం విస్తృత సమావేశం నిర్వహించారు. రానున్న రోజుల్లో వార్డులో చేపట్టాల్సిన కార్యక్రమాలు, పార్టీ బలోపేతం, కూటమి ప్రభుత్వ మోసపూరిత హామీలు తదితర అంశాలపై చర్చించారు.

ఉత్తమ ఉపాధ్యాయిని నాగమణికి సన్మానం

ప్రజాశక్తి-పెందుర్తి : 2024 సంవత్సరానికి రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీత డాక్టర్ ఎం.నాగమణిని ప్రభుత్వ పాలిటెక్నిక్ సిబ్బంది సన్మానించారు. సాంకేతిక విద్యాశాఖకు, విద్యార్థులకు నాగమణి చేసిన సేవలను పలువురు కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.చంద్రశేఖర్, విఆర్ఎల్.మూర్తి, కె.సత్తిబాబు, బి.శేషసాయి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామిక విలువలను రక్షించాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విశాఖపట్నం ప్రశస్తిని, ప్రజాస్వామిక విలువలను యువత రక్షించాల్సిన అవసరం ఉందని వక్తలు పేర్కొన్నారు. విశాఖ పబ్లిక్ లైబ్రరీ, సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ నిర్వహణలో కమింగ్ టుగెదర్ ఫర్ డెసిమినేషన్ ఆఫ్ నాలెడ్జ్ కార్యక్రమంలో భాగంగా అమెరికాలో మాగ్నా ఇంటర్ నేషనల్ సిఇఒ, డైరెక్టర్ సీతారామస్వామి కోటగిరి ఉద్యోగార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. గ్రంథాలయం ఉపాధ్యక్షులు టిఎస్ఆర్ ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సెంటర్ ఫర్ పాలసీ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.ప్రసన్నకుమార్ మాట్లాడుతూ, యువత మంచి పుస్తకాలు చదివి జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని ఉద్బోధించారు. కఠోర శ్రమ, లక్ష్య సాధన దీక్ష, వృత్తిపట్ల అంకిత భావం ఉండాలని చెప్పారు. విద్యార్థుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పారు. ఆత్మ విశ్వాసం ఉంటే మనల్ని గెలిపిస్తుందని, ఫలితం ఆశించకుండా మంచికోసం పనిచేయాలని సందేశమిచ్చారు .

ఫార్మా పరిశ్రమల్లో నీటి ఎద్దడిని నివారించాలి : గనిశెట్టి

ప్రజాశక్తి - పరవాడ : మండలంలోని ఫార్మా సిటీలో 98 పరిశ్రమలకు మూడు రోజులుగా నీటి సరఫరా లేక పూర్తిస్థాయి ఉత్పత్తి సాగని పరిస్థితుల్లో కాంట్రాక్ట్ కార్మికులను తగ్గిస్తామని ఫార్మా పరిశ్రమల యాజమాన్యాలు అంటున్నాయని, దీనిపై సంబంధిత జిల్లా అధికారులు స్పందించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గనిశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. రాంకీ బాధ్యతా రహితంగా వ్యవహరించడం, మరో వైపు ఎపిఐఐసి నిర్లక్ష్యం వలన ఫార్మా పరిశ్రమలకు మూడు రోజులుగా నీటి సరఫరా నిలిచిపోయిందన్నారు ఇటువంటి పరిస్థితుల్లో ఏదైనా ప్రమాదం జరిగితే, అదుపు చేయడమే కష్టమే నన్నారు. మరోవైపు గ్రామాల్లో బోర్లు బావుల నుండి ట్యాంకర్ల ద్వారా నీటిని యాజమాన్యాలు కొనుగోలు చేస్తున్నాయని దీనివల్ల గ్రామాల్లో నీటి కష్టాలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. వెంటనే ప్రభుత్వ అధికారులు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని గనిశెట్టి డిమాండ్ చేశారు.

జాతీయ స్థాయి ఈత పోటీలకు 'సంస్కృతి గ్లోబల్' విద్యార్థులు

ప్రజాశక్తి-పరవాడ: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నర్సరావుపేట పల్నాడు లో జరిగిన రాష్ట్ర స్థాయి ఈత పోటీలలో సత్తా చూపి, పతకాలు సాధించిన తమ పాఠశాల విద్యార్థులు జి.ధార్మిక, స్మృతి రాణి, జి.రోషిణి, తేజ రెడ్డి ఈ నెల 24 నుండి 30వరకు గుజరాత్, రాజకోట్ లో జరుగు జాతీయ స్థాయి పోటీలలో ఎంపికయ్యారని సంస్కృతి గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్. ఎన్. సీతాలక్ష్మి తెలిపారు.

ప్రతిభ చూపిన విద్యార్థులు, కోచ్ హరినాథ్ రెడ్డిని పాఠశాల సిఇఒ కె.నిశాంత్ అభినందించారు.

ఇంటింటా సర్వే పరిశీలన

ప్రజాశక్తి- సబ్బవరం : మండలంలోని అసకపల్లి, బాట జంగాలపాలెం,పైడివాడ అగ్రహారం, గొల్లలపాలెం పంచాయతీలలో జిల్లా పంచాయతీ అధికారి ఆర్. శిరీషారాణి గురువారం సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాలలో సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. గ్రామ పంచాయతీలలో జరుగుతున్న స్వర్ణాంధ్ర సర్వేపై సిబ్బందితో సమీక్ష నిర్వహించారు.రికార్డులు పరిశీలించి, సర్వే ను వేగవంతం చేయాలని ఆదేశించారు. డిపిఆర్ సి నాగలక్ష్మి, ఇఒపిఆర్డి చైతన్య, ఆయా గ్రామాల కార్యదర్శులు, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

ఆయుష్ విధానాలపై ఆశాలకు అవగాహన

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : మండలంలోని తురకలపూడి ఆరోగ్య కేంద్రంలో ఆశ కార్యకర్తలకు గురువారం ఆయుష్ వైద్య విధానాలపై గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పలు గ్రామాలకు చెందిన ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు

చిన్నారి వైద్యానికి ఆర్థిక సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సత్యారావు

ప్రజాశక్తి -వడ్డాది : చిన్నారి సాహిత్య చికిత్సకు విఎస్ఆర్ సేవా సంస్థ ఆర్థిక సాయాన్ని అందించడంతో కుటుంబీకులు ఆనందం వ్యక్తం చేశారు. నర్సీపట్నం గ్రామానికి చెందిన చుచుపట్ల సాయి, దేవి దంపతుల కుమార్తె ఐదేళ్ల సాహిత్య ఇటీవల ఆడుకోవడానికి బయటకు వెళ్లి ఆడుకునే సమయంలో ఇనుప కడ్డీల మీద పడడంతో లోలోపల గాయాలు కావడంతో మూత్ర విసర్జన సమయంలో రక్తం వస్తుండడంతో విశాఖపట్నం కిమ్స్ ఆసుపత్రిలో చేర్పించారు. చిన్నారి వైద్యానికి రూ.ఐదు లక్షలు ఖర్చవుతుందని చెప్పడంతో ఆర్థిక స్తోమత లేని దేవి సాయి దంపతులు విఎస్ఆర్.సేవా సంస్థను ఆశ్రయించగా, సంస్థ అధినేత వడ్డి సత్యారావు బృందంగా వైజాగ్ కిమ్స్ ఆసుపత్రికి నేరుగా వెళ్లి, చిన్నారి మందుల ఖర్చుకు రూ. 18వేలు ఆర్థికసాయం చేశారు.

బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు వద్దు

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం

ప్రజాశక్తి-అనకాపల్లి : నక్కపల్లి ప్రాంతంలో 2021 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. గురువారం పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం ప్రకటన విడుదల చేశారు.

ఇప్పటికే ఆ ప్రాంతంలో హెటిరో పరిశ్రమ వ్యర్థ కాలుష్యంతో మత్స్యకారుల ఉపాధి దెబ్బతిందని, పరిసర గ్రామాల ప్రజలు వివిధ రకాల రోగాలతో బాధపడు తున్నారన్నారు .కాలుష్యకారక పరిశ్రమలు ఏర్పాటుతో బాధపడుతున్న ప్రజలకు ఒక ప్రత్యామ్నాయాన్ని చూపించాల్సిన కూటమి, ప్రభుత్వం గతంలో వైసిపి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని యధాతదంగా అమలు చేయాలనుకోవడం అన్యాయమన్నారు. వైసిపి, కూటమి ప్రభుత్వాలు దొందూదొందేనని, వీరికి పారిశ్రామిక దిపతుల ప్రయోజనాలే తప్ప ప్రజల ప్రయోజనాలు, వారి బాధలు పట్టవని బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుతో మరోసారి రుజువైందన్నారు.. గతంలో కాకినాడ జిల్లా తొండంగిలో తీవ్ర కాలుష్యాన్ని వెదజల్లే బల్క్ డ్రగ్ పార్కును ఏర్పాటు చేయాలని చూస్తే అక్కడ ప్రజలు, రైతులు పెద్ద ఎత్తున ఉద్యమించారు. కాలుష్య కోరల్లో చిక్కుకొని తమ గ్రామాన్ని తరలించాలని పరవాడ మండలం తాడి గ్రామస్తులు ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వాలకు పట్టడం లేదన్నారు. ఇప్పుడు మరలా నక్కపల్లి ప్రాంతాన్ని రసాయనిక వ్యర్థాలతో డంపింగ్ యార్డుగా మార్చాలని చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజలు దీనిపై అవగాహన కలిగి, బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటు నిర్ణయాన్ని రద్దు చేసే వరకు పోరాడాలని పిలుపునిచ్చారు. కాలుష్య రహిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సిపిఎం విజ్ఞప్తి చేస్తోందన్నారు.

యుటిఎఫ్ మండల కమిటీ కార్యవర్గం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం



మామిడి బాబూరావు



నాతవరపు సతీష్

ప్రజాశక్తి-అనకాపల్లి : యుటిఎఫ్ అనకాపల్లి మండల శాఖ నూతన కార్యవర్గాన్ని గురువారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఎన్నుకున్నారు. యుటిఎఫ్ అనకాపల్లి మండల కౌన్సిల్ సమావేశంలో మండల యుటిఎఫ్ అధ్యక్షునిగా మామిడి బాబూరావు, ప్రధాన కార్యదర్శిగా నాతవరపు సతీష్‌లను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా బైలపూడి దేవుడునాయుడు, సహాధ్యక్షులు కొమ్మోజు సత్యవేణి, మరియు శిరసపల్లి శ్రీనివాసరావు లు ఎన్నికయ్యారు, కోశాధికారిగా కష్ణ కిషోర్, కార్యదర్శులుగా బివి సత్యనారాయణ, కురందాసు నారాయణ, పావని, పుర్రె రమణ, ఎం.జగన్నాధం, రవీంద్ర పాత్రుడు ఎన్నికయ్యారు.ఆడిట్ కమిటీ కన్వీనర్‌గా ఎం. తేజ్ వర్ధన్, మహిళా సబ్ కమిటీ సభ్యురాలుగా పి. పల్లవి ,జిల్లా కౌన్సిలర్లుగా ఎం.రాజు నాయుడు, ఆర్. అక్కు నాయుడు ఎన్నికయ్యారు. యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి ఎన్నికల అధికారిగా వ్యవహరించి, ప్రమాణస్వీకారం చేయించారు. ఎన్నుకోబడిన అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు, సభ్యులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సంక్షేమం కోసం విద్యాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేశారు.

కార్మిక సంక్షేమ బోర్డును పునరుద్ధరించండి

ప్రజాశక్తి-అనకాపల్లి : భవన నిర్మాణ కార్మికుల పెండింగ్ క్లెయిమ్స్ పరిష్కారానికి ప్రభుత్వం నిర్దిష్ట చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ భవన నిర్మాణకార్మిక సంఘం, ఎఐటియుసి అనకాపల్లి జిల్లా ప్రధాన కార్యదర్శి కోన లక్ష్మణ డిమాండ్ చేశారు. భవననిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు పునరుద్ధరణ, కార్మిక సమస్యలపై మంగళవారం అసెంబ్లీలో తాడేపల్లిగూడెం, తణుకు ఎమ్మెల్యేలు, స్పష్టత కోరగా కార్మికశాఖ మంత్రి వి.సుభాష్ తప్పుడు సమాచారం ఇవ్వడాన్ని లక్ష్మణ తప్పుపట్టారు. సంక్షేమ బోర్డులో రూ. వెయ్యి కోట్ల నిధులు ఉన్నాయని ఒకపక్క చెబుతూనే క్లెయిమ్స్ పరిష్కారాన్ని పరిశీలి స్తామని మంత్రి చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా లబ్ధి పొందే కార్మికులు, ప్రభుత్వ పథకాలలో కూడా రెండో సారి ప్రయోజనం పొంద తున్నారన్న అనవసరపు సందేహాన్ని మంత్రి వ్యక్తం చేశారన్నారు. ఇదే సందేహం వ్యక్తం చేసిన గత జగన్ ప్రభుత్వం, 2019 నవంబరులో క్లెయిమ్ చెల్లింపులను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చిందన్నారు. దాంతో రాష్ట్రంలో 42 వేల క్లెయిమ్లు పెండింగులో ఉన్నాయని గుర్తు చేశారు. సంక్షేమ బోర్డు పునరుద్ధరణపై నిర్దిష్ట హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఇప్పుడు పరిశీలిస్తామని చెప్పడం మాట మార్చడమేనని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులను తక్షణం ఉపసంహరించుకోవాలని, చెల్లింపుల సమస్య పరిష్కరించాలని, దారి మళ్లించిన నిధులను తిరిగి జమ చేయాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బోర్డ్ పునరుద్ధరణకు రూ.కోటి సొంత నిధులు ఇస్తామని పవన్ కల్యాణ్ ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని కోరారు. సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించాలని లేకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

నేవీ రోడ్డు అధ్వాన స్థితిపై ఆందోళన



ఆందోళన చేస్తున్న ప్రజలు, ప్రజాసంఘాల నేతలు

ప్రజాశక్తి -రాంబిల్లి : నిండా గోతులమయమై, దుమ్ముధూళి వెదజలుతున్న నేవీ రోడ్డు అధ్వాన్నస్థితిలో గురువారం మండలంలోని గోవింద పాలెం జంక్షన్‌లో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చి ఆందోళన చేపట్టారు. నేవీ రోడ్డు పునర్నిర్మాణం చేపట్టాలని, దుమ్ము ధూళితో అనారోగ్యం పాలవుతున్న ప్రజలను కాపాడాలని కోరుతూ, రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు. వీరి ఆందోళనకు మద్దతు తెలిపిన సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు జి దేవుడునాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు మాట్లాడుతూ, నిండా గుంతలతో అధ్వానంగా ఉన్న నేవీరోడ్డులో దుమ్ముధూళి భారీ ఎత్తున రేగడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టాలని కోరారు హెవీ రాళ్ళ లోడ్లతో వస్తున్న భారీ వాహనాలు స్పీడు తగ్గించే చర్యలు చేపట్టాలని, దుమ్ము రేగకుండా తక్షణచర్యలుగా రోడ్డును వాటరింగ్ చేయించాలని, శాశ్వతప్రాతిపదికన రోడ్డు పునర్నిర్మించాలని కోరారు. నేవీ పీడీ, స్థానిక సివి, ఎల్అండ్‌టి కంపెనీ ప్రతినిధులు,ఆందోళనకారులతో మాట్లాడి తక్షణమే రోడ్డు తడిపిస్తామని, కొత్త రోడ్డు నిర్మాణానికి చర్యలు చేపడతామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

కార్పొరేషన్ చైర్మన్ల ప్రమాణ స్వీకారం



సురేంద్రను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కొణతాల, మాజీ ఎమ్మెల్యే పీలా

ప్రజాశక్తి-అనకాపల్లి : విజయవాడ గొల్లపూడిలో బిసి భవన్‌లో గురువారం రాష్ట్ర గవర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ మళ్ళ సురేంద్ర, రాష్ట్ర కొప్పుల వెలమ సంక్షేమ, విశాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ ప్రమాణ స్వీకారం ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ, చోడవరం ఎమ్మెల్యే ఎంఎస్ఎంఎస్.రాజు, రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు, జీవీఎంసీ ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రాంకీ, బిజెపి నాయకులు సీఎం రాజేష్ పాల్గొని శు భాకాంక్షలు తెలిపారు.

చైర్మన్లకు శుభాకాంక్షలు

కశింకోట : రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్రకు తెలుగు రైతు కార్యదర్శి గొంతిని శ్రీనివాసరావు, అచ్చెర్ల, తాళ్ళ పాలెం గ్రామ టీడీపీ అధ్యక్షులు నైనముశెట్టి రమణ రావు, ఉల్లింగల రమేష్, నారిపిల్లి ప్రసాద్ కలిసిశుభాకాంక్షలు తెలిపారు.

దేవరాపల్లి: రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ పివిజి కుమార్ ప్రమాణ స్వీకారానికి దేవరాపల్లి మండల టిడిపి శ్రేణులు భారీగా హాజరై శుభాకాంక్షలు తెలిపారు. టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు, మండల పార్టీ అధ్యక్షులు చిటిమిరెడ్డి సూర్యనారాయణ మాజీ ఎంపిపి కిలపర్తి భాస్కరరావు, పోతల పాత్రు నాయుడు, కొమర బాబురావు, గాలి రవికుమార్, మాజీ సర్పంచ్ లు, చల్లా నానాజీ, పెద్దాడ వెంకట రమణ, సోమిరెడ్డి గోవింద, చల్లా తాతయ్యలు, రాజు నాయుడు, కర్రి నాయుడు బాబు, కడియం నాగేశ్వరరావు , వార్డు మెంబర్లు దీవి శంకర్రావు, బంధం అప్పలరాజు, క్లస్టర్ ఇంచార్జ్ గుల్లేపల్లి అర్జున్, ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షులు తేడా చిన్నారావు, గొర్లి దేముళ్ళ, తమడాన ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు గండి బాబ్జి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి.- సబ్బవరం : ఈ నెల 22న శుక్రవారం మధ్యాహ్నం 12:30 గంటలకు ఎపి కోఆపరేటివ్ ఆయిల్ సీడ్స్ గ్రోవర్స్ ఫెడరేషన్ చైర్మన్‌గా టిడిపివిశాఖ జిల్లా అధ్యక్షులు గండి బాబ్జి ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు టిడిపి వర్గాలు తెలిపారు. పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, శ్రేయోభిలాషులు, అభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు.

ఇన్‌ఛార్జి మంత్రిని కలిసిన ప్రగడ



మంత్రి రవీంద్రను సత్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి కొల్లు రవీంద్రను గురువారం రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్, ఎలమంచిలి తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ప్రగడ నాగేశ్వరరావు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. పి కొండబాబు, పి రాజు ఉన్నారు.

'డైట్'లో టెలివిజన్ డే

ప్రజాశక్తి- అనకాపల్లి : స్థానిక డైట్ అటానమస్ కళాశాలలో ఇసిఇ విభాగం ఆధ్వర్యంలో గురువారం జాతీయ టెలివిజన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల విద్యార్థులు సిహెచ్ చంద్రిక, కె.లాస్యశ్రీ, జి.మానస, డి.సాయిభారతి, డి.లోహిత్ టెలివిజన్ ఆవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో ఇసిఇ విభాగాధిపతి, డాక్టర్ పి.పూర్ణప్రియ, డాక్టర్ ఎ.నళిని, డాక్టర్ అంజనీకుమార్, ప్రాజెక్ట్ ఇంజినీర్ బి. శేషగిరిరావు పాల్గొన్నారు.

26న నిరసన జయప్రదానికి ప్రచారం


యలమంచిలి రైల్వే స్టేషన్‌రోడ్డులో కరపత్రాల ఆవిష్కరణ

ప్రజాశక్తి - యలమంచిలి : కేంద్రంలో బిజెపి సంకీర్ణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రైతు, కార్మికుల సమస్యలు పట్టించుకోకుండా, ప్రజా వ్యతిరేక వ్యతిరేక విధానాలు అమలు చేస్తోందని స్థానిక సిఐటియు నాయకులు ఆందోళన వ్యక్తంచేశారు. గురువారం పట్టణంలో పట్టణంలో సిఐటియు ఆధ్వర్యంలో ఫైర్ ఆఫీసు కొలనీ, నెహ్రూనగర్, ఎన్టీఆర్ కాలనీ, తులసీనగర్, కాకివాని వీధి, పాత వీధి, ధర్మవరం, మిలటరీ కాలనీల్లో సిఐటియు ఆధ్వర్యాన ప్రచారం చేపట్టారు. ఈ నెల 26న అనకాపల్లి నెహ్రూచౌక్ వద్ద నిర్వహించే మహా ధర్నాలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సిఐటియు మండల కార్యదర్శి చింతకాయల శివాజీ, చిరంజీవి, అప్పారావు పాల్గొన్నారు.

కె.కోటపాడు :కేంద్ర ప్రభుత్వ కార్మిక కర్షక వ్యతిరేక విధానాలకు ఈనెల 26న నిరసనగా అనకాపల్లిలో నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు కోరారు గురువారం మండలంలోని ఆర్‌వై అగ్రహారం, సూనుడ్డిపాలెం, ఎ.కోడూరు, కురువాడ, సింగన్న దొరపాలెం. పడుగుపాలెం గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయినబాబు మాట్లాడుతూ కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మిక కర్షకులను అనేక విధాలుగా ఇబ్బందులు పాలు చేసి కార్పొరేట్ సంస్థలకు వేల కోట్ల రూపాయలు దోచిపెడుతున్నారని విమర్శించారు. విశాఖ స్టీల్‌ప్లాంట్ లాంటి ప్రభుత్వరంగసంస్థలకు కార్పొరేట్లకు కట్టబెట్టాలని చూస్తున్నారన్నారు. పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడం, ధరాభారం, కార్మికులకు కనీసవేతనాలు, ఉద్యోగ భద్రత వంటి సమస్యలపై అనకాపల్లిలో నెహ్రూ చౌక్ వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని కోరారు.

ఆరిలోవ : అఖిలపక్ష కార్మిక సంఘాలు, రైతు కిసాన్ మోర్చా ఆధ్వర్యాన ఈ నెల 26న డిఆర్ఎం ఆఫీసు నుంచి జివిఎంసి గాంధీ విగ్రహం వరకు చేపట్టే మహా ప్రదర్శనను, అనంతరం జరిగే బహిరంగ ప్రదర్శనను జయప్రదం చేయాలని ఎఐటియుసి నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం హనుమంతువాక కూడలిలో పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ఉపాధ్యక్షులు ఎస్‌కె.రెహ్మాన్, సిపిఐ నాయకులు లక్ష్మణరావు, ఆటో యూనియన్ నాయకులు ఎస్.సూరిబాబు, రాజేష్, రెడ్డి, సుధ, గంగ పాల్గొన్నారు.

ములగాడ : కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ కార్మిక, రైతాంగ, ప్రజావ్యతిరేక విధానాలపై ఈ నెల 24న గాజువాకలో చేపట్టే ప్రదర్శన, 26న రైల్వే డిఆర్ఎం ఆఫీసు నుంచి జివిఎంసి గాంధీ వరకు చేపట్టే ర్యాలీని జయప్రదం చేయాలని అఖిలపక్ష కార్మిక సంఘాలు విజ్ఞప్తి చేశాయి. ఈ మేరకు ములగాడ వెంకన్నపాలెంలోని సిఐటియు కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు కె.పెంటారావు, ఆర్.లక్ష్మణ మూర్తి, పి.పైడిరాజు, ఎం.కృష్ణారావు, కె.సత్యనారాయణ జి.రాంబాబు, తాతబాబు, నర్సింగరావు పాల్గొన్నారు.


ములగాడలో పోస్టర్ల ఆవిష్కరణలో కార్మికసంఘాల నేతలు

సీతమ్మధార : చిల్లర వర్తకులకు, ఆటో డ్రైవర్లకు సమగ్ర సంక్షేమ చట్టం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 26న జరుగు కార్మిక ప్రదర్శన బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ అక్కయ్యపాలెం నరసింహనగర్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఐటియుసి నాయకులు కేలం శివ రావికిష్ణ, వెల్లుల్లిపాయలు శ్రీనివాస్, పి.సూర్యారావు, సాయికుమార్, లక్ష్మణరావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రదర్శన, బహిరంగ సభను విజయవంతం చేయాలని ఎఐటియుసి జిల్లా కార్యదర్శి పడాల గోవింద్ ఆధ్వర్యాన సీతమ్మధార జంక్షన్ అల్లూరి విగ్రహం వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్.మధురెడ్డి, రావి అశోక్, శ్రీను, శివ, సతీష్, స్వామి తదితరులు పాల్గొన్నారు.

విపత్తుల సమయంలో అప్రమత్తత

ప్రజాశక్తి-అచ్యుతాపురం : భారీ వర్షాలు ఉరుములు, మెరుపులు గాలులు వేసే సమయంలో వికలాంగులు బయటికి వెళ్లద్దని ఎన్‌డిఆర్‌ఎఫ్ 10వ బెటాలియన్ టీం కమాండర్ వై సత్యనారాయణ అన్నారు. గురువారం అచ్యుతాపురం మండల వికలాంగుల ఆశ్రమ పాఠశాలలో ప్రకృతి విపత్తులు ప్రమాదాలు సంభవించినపుడు తీసుకోవలసిన ముందస్తు జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు.కోస్తా తీర మండలాల గ్రామాల్లోని పాఠశాలలు, పరిశ్రమలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సదస్సులో జాతీయ అవార్డు గ్రహీత పిఎస్‌డి పట్నాయక్ పాల్గొన్నారు.

పంట కోత ప్రయోగాలే దిగుబడికి ప్రామాణికం

ప్రజాశక్తి.-సబ్బవరం : పంట కోత ప్రయోగాలే పంటల దిగుబడికి ప్రామాణికమని జిల్లా వ్యవసాయ అధికారి బి. మోహనరావు అన్నారు. మండలంలోని నారపాడు గ్రామంలో గురువారం చేపట్టిన వరి పంట కోత ప్రయోగాన్ని పరిశీలించారు. వరి పంట కోత ప్రయోగాల వలన జిల్లాలో వరి పంట దిగుబడి సరళి స్పష్టమౌతోందన్నారు గ్రామ వ్యవసాయ సహాయకులకు తమకు కేటాయించిన వరి పంట కోత ప్రయోగాలను జాగ్రత్తగా చేపట్టాలన్నారు. ఎఒ పోతల సత్యనారాయణ , ఎడిఎ వసంతకుమారి, ఏఎస్ఒ రమాదేవి, టాటా ఇన్సూరెన్స్ కంపెనీ ప్రతినిధి చల్లా వాసు , గ్రామ వ్యవసాయ సహాయకులు హరీష్, అప్పారావు పాల్గొన్నారు.

వరి పైర్లు సస్యరక్షణపై అవగాహన

దేవరాపల్లి : మండలంలోని కలిగొట్ల గ్రామంలో మండల వ్యవసాయాధికారి ఎల్‌వై కాంతమ్మ ఆధ్వర్యంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులతో కలిసి వరి పంటను పరిశీలించారు. వరిపైర్లను ఆశించిన రెల్లరాల్లు పురుగు నివారణకు సస్యరక్షణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారి ఎస్ కిరణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-అనకాపల్లి : 33/11 కెవి కశింకోట సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా కొత్తూరు సెక్షన్ పరిధిలోని కొత్తూరు సబ్‌స్టేషన్‌లో కొత్తూరు ఫీడర్, కశింకోట ఎంహెచ్యూ ఫీడర్ మరమ్మత్తులు, చెట్టుకొమ్మలు తొలగింపు కారణంగా కొత్తూరు, పిసినికాడ గ్రామాలకు శుక్రవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపి డిసిఎల్ కశింకోట డివిజన్ ఆపరేషన్స్ ఇఇ రామకృష్ణ తెలిపారు.

కశింకోట : మండలంలోని తాళ్లపాలెం సెక్షన్ పరిధిలోని నరసింగబిల్లి సబ్ స్టేషన్‌లో విద్యుత్ మరమ్మతులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుండి సాయంత్రం 5 వరకు నర్సింగబిల్లి, గొబ్బూరు, చింతలపాలెం,తాళ్లపాలెం, బంగారయ్య పేట, ఉగ్గినపాలెం, పరవాడపాలెం, జమ్మదలపాలెం, కొతపల్లి, బుచ్చయ్యపేట, పేరంటాలపాలెం,ఎపి పేట, గొబ్బూరుపాలెం, నరసాపురం,ఏనుగు తుని, సోమవారం,చినఏనుగు తుని, జి.భీమవరం, అడ్డం, అచెర్ల, కొత్త అచెర్ల, మొసయ్యపేట, గోకివానిపాలెం గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ రామకృష్ణ తెలిపారు.

సబ్బవరం: మండలంలో సబ్బవరం 1,2 పరిధిలోని 33 కెవి ఫీడర్‌లో మరమ్మతులు కారణంగా 22న శుక్రవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు సబ్బవరం,అంతకపల్లి సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఇఇ రామకృష్ణ తెలిపారు.

అచ్యుతాపురం : దిబ్బపాలెం, వెదురువాడ, అచ్యుతాపురం 11కెవి విద్యుత్ లైన్ల కింద జంగిల్ క్లియరెన్స్ కారణంగా ఈనెల 22న శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు అచ్యుతాపురం, మోసయ్యపేట, జంగులూరు ,భోగాపురం, మార్టూరు రోడ్డు, దిబ్బపాలెం, వెదురువాడ, ఎల్ ధర్మవరం, ఎం ధర్మవరం, కుమారపురము దుప్పుతూరు, మార్టూరు గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండదని ఎపిఇపిడిసిఎల్ ఇఇ కె.రాజశేఖర్ ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

గాజువాక: ఎపిఇపిడిసిఎల్, జోన్-2 ఆపరేషన్స్ ఇఇ బికె.నాయుడు ఆదేశాల మేరకు 33/11కెవి కెబిఆర్ సబ్‌స్టేషన్ పరిధిలోని కూర్మన్నపాలెం 11కెవి ఫీడరులో విద్యుత్‌లైన్ల నిర్వహణ, వేలాడుతున్న విద్యుత్ వైర్లు సరిచేయడం, చెట్ల కొమ్మల తొలగింపు, ఇతర మరమ్మతు పనుల దృష్ట్యా ఈనెల 22న శుక్రవారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ రుషికేష్ తెలిపారు. శాతవాహననగర్‌లోని 1 నుంచి 9వ రోడ్డు వరకు,యాతపాలెం, ముస్తఫాజంక్షన్, భరత్‌నగర్, కూర్మన్నపాలెం, ఐటిఐ రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు సహకరించాలని ఎఇ రుషికేష్ కోరారు.

పాఠశాలల పని వేళలను పెంచొద్దు : యుటిఎఫ్

ప్రజాశక్తి-అనకాపల్లి : పాఠశాలల పని వేళలను పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం సరికాదనియుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి అన్నారు. అనకాపల్లి జిల్లాలో పైలెట్ ప్రాజెక్టుగా ప్రభుత్వం 30 హైస్కూళ్లలో ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పనిచేయాలని డిఇఒ ఉత్తర్వులిచ్చి నేపథ్యంలో స్పందిస్తూ, పాఠశాలల పనివేళలు పెంచడం వలన విద్యార్థులు అధికంగా శ్రమించవలసి వస్తుందన్నారు. ఉదయం పాఠశాలకు వచ్చేటపుడు, సాయంత్రం పాఠశాలలు విడిచిన తర్వాత ఇంటికి వెళ్లాలంటే విద్యార్థులు, ముఖ్యంగా బాలికలు ఇబ్బందిపడే పరిస్థితి ఉందన్నారు.

ప్రస్తుతం శీతాకాలం కావడంతో గ్రామీణ ప్రాంతాలకు సరైన రవాణా సౌకర్యం లేకపోవడం వల్ల ఉన్నతపాఠశాలల విద్యార్థినులు చీకటిపడ్డాక ఇళ్లకు వెళ్లడం భద్రతాపరమైన సమస్యలు ఉత్పన్నమయ్యే పరిస్థితి ఉందన్నారు.. దేశంలో అన్ని రాష్ట్రాల్లో పాఠశాలలు సాయంత్రం నాలుగులోపే ముగుస్తుంటే, ఇక్కడ ఒక గంట పెంచడం సరికాదన్నారు. స్కూల్స్‌లో టైమింగ్స్ ఒక గంట పెంచినప్పటికీ, పాత విధానంలోనే ఎనిమిది పీరియడ్లను మాత్రమే ఉంచడం వల్ల పెద్దగా ప్రయోజనం లేదని చిన్నబ్బాయి తెలిపారు.

చెత్త బుట్టల పంపిణీ

ప్రజాశక్తి- అనకాపల్లి : మండలంలోని తుమ్మపాల గ్రామపంచాయతీలో తడి చెత్త పొడి చెత్త బుట్టలను గురువారం సర్పంచ్ తట్ట పెంటయ్య నాయుడు పంపిణీ చేశారు. ఇంటి పన్ను రసీదులను ఆధారంగా చేసికొని ప్రతి ఒక్కరి పేరును నమోదు చేయించుకున్న తర్వాత ఇంటింటికీ చెత్త బుట్టలను అందజేశారు. ఇళ్లల్లోని చెత్తను రోడ్లపై వేయకుండా ఇంటింటికీ వచ్చే పారిశుధ్య వాహనానికి అందజేయాలని కోరారు.కార్యక్రమంలో ఎంపీటీసీ పంచదార కన్నారావు, కూటమి నాయకులు బొడ్డపాటి రామ కుమార్, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, బొడ్డపాటి రాజారావు, ఈవో సత్య ప్రసాదు, ఆర్సీసీ సత్యనారాయణ, వార్డ్ మెంబర్లు తర్ర సత్య రావు, మాది బోయిన నాగరాజు పాల్గొన్నారు.

సత్యదేవుని దేవస్థానానికి..

స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణ సూర్యనారాయణ స్వామి దేవస్థానానికి డిసిసిబి బ్రాంచ్ మేనేజర్ వాడపల్లి కుమార్ చెత్తబుట్టలను దేవస్థాన చైర్మన్ బొడ్డేడ మురళికి అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు పెంటకోట చంద్రరావు, మారిశెట్టి భాస్కరరావు శ్రీకాకుళం గణపతి,సూరిశెట్టి బల్లమ్మ, దేవస్థానం ప్రధాన అర్చకులు ఎం విద్యాసాగర్ శర్మ బ్యాంక్ ఉద్యోగులు తేలపాల శ్రీనివాసరావు, పసుమర్తి ఆనంద్, కోసూరు శేష్ కుమార్ పాల్గొన్నారు.

పెదగొల్లలపాలెం విఆర్‌ఎ హఠాన్మరణం

ప్రజాశక్తి-సబ్బవరం.: మండలంలోని పెదగొల్లలపాలెం విఆర్ఎ కొమ్ము సింహాద్రి గురువారం సాయంత్రం హఠాన్మరణం పొందారు.మృతుడు సింహాద్రికి భార్య గంగాభవాని, కుమార్తె హర్షిత, కుమారుడు వర్షిత్ ఉన్నారు . సింహాద్రి అకాల మరణం చెందడంతో కుటుంబీకులు కన్నీరు మున్నీరయ్యారు. గ్రామంలోని సర్పంచ్, ఎంపిటిసి పలువురు నేతలు సింహాద్రి కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు.

రోడ్డు అంచుల్లో పిచ్చిమొక్కల తొలగింపు

ప్రజాశక్తి -మునగపాక: మండలంలోని వెంకటాపురం గ్రామంలో సర్పంచ్ సుందరపు నీలకంఠ స్వామి (తాతాజీ) ఆధ్వర్యంలో గురువారం రోడ్డుకు ఇరువైపులా పేరుకు పోయిన పిచ్చిమొక్కలను గ్రామం నుంచి సబ్‌స్టేషన్ వరకు జెసిబి సాయంతో తొలగించారు. ఎంపిటిసి మద్దాల వీరునాయుడు, ముమ్మిన శ్రీనివాసరావు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ ఈశ్వరరావు పాల్గొన్నారు.

అన్న సమారాధన

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ శివారు గరుగుబిల్లి గ్రామంలో షిరిడి సాయిబాబా ఆలయం 29వ వార్షికోత్సవాన్ని గురువారం చోడవరం సుగర్స్ మాజీ డైరెక్టర్ రాజ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆలయం వద్ద .అన్న సమారాధన నిర్వహించారు కార్యక్రమంలో పాల సొసైటీ డైరెక్టర్ సుందరపు గంగాధర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి మత్స్యకారుల ఆందోళన

ప్రజాశక్తి -అచ్యుతాపురం : తమ సమస్యల పరిష్కరించాలని కోరుతూ ఎపి మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో గురువారం పూడిమడక సముద్రతీరంలో మత్స్యకారులు ఆందోళన చేశారు. గురువారం ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా మత్స్య కార్మిక సంఘం ప్రతినిధులు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో చేపట్టిన ఆందోళనలోతీరంలో విష వ్యర్థ రసాయనిక పదార్థాలతో చనిపోయిన చేపలను ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా మత్స్య కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చొడిపల్లి అప్పారావు, నాయకులు చేపల తాతయ్య మాట్లాడుతూ, పరిశ్రమలు విడుదల చేస్తున్న రసాయనిక వ్యర్థాలతో తమ జీవనాధారమైన మత్స్య సంపద అంతరించిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. మత్స్యకారుల సంక్షేమానికి ప్రభుత్వాలు ప్రకటించిన పథకాలు తమకు అందడంలేదన్నారు. వేట నిషేధ సమయంలో ప్రభుత్వం ప్రకటించిన రూ. 20 వేల మత్స్యకార భరోసా ఆర్థిక సహాయాన్ని వెంటనే ఖాతాలలో జమ చేయాలని డిమాండ్ చేశారు. పూడిమడక తీరంలో ఫిషింగ్ హార్బర్ పూర్తిచేయాలని, డీజిల్ , బోట్లు వలలు సబ్సిడీపై మంజూరు చేయాలని కోరారు. ఎస్ఇజెడ్ పరిశ్రమలలో స్థానిక మత్స్యకారులకు ఉద్యోగాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్ రాము, ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, తిక్కాడ నూకమ్మ వాసుపల్లి కొమరం పాల్గొన్నారు.


పూడిమడక సముద్రతీరంలో ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

ఎన్‌టిపిసిలో యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి

మత్స్యకార యువతకు ఎన్‌టిపిసిలో ఉద్యోగ అవకాశాలు కల్పించాలని పూడిమడక తీరంలో కొండ పాలెం జాలరిపాలెం పూడిమడక పెద్దూరు గ్రామాలకు చెందిన మత్స్యకారులు ఆందోళన చేపట్టారు. 50ఏళ్లు దాటిన ప్రతి మత్స్యకారులకు రూ. 20 లక్షల ప్యాకేజీ ఇవ్వాలని, మత్స్యకార పిల్లలకు విద్య అందించాలని, గ్రామంలో ఎన్‌టిపిసి నిధులతో హాస్పిటల్ నిర్మించి మెరుగైన వైద్య సేవలు అదించాలని కోరారు. పూడిమడక లో ఇంటింటికి ఎన్‌టిపిసి ద్వారా ఉచితంగా విద్యుత్తు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

మాదక ద్రవ్యాలతో యువత భవిష్యత్తు నాశనం

- డిఐజి గోపినాథ్

ప్రజాశక్తి- నక్కపల్లి:యువత మాధకద్రవ్యాల మత్తులో పడి తమ బంగారు భవిష్యత్‌ని నాశనం చేసుకోవద్దని విశాఖపట్నం రేంజ్ డి.ఐ.జి గోపినాథ్ జట్టి విద్యార్థులకు సూచించారు. పాయకరావుపేట శ్రీ ప్రకాష్ విద్యా సంస్థలో గురువారం ఏర్పాటు చేసిన సంకల్పం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలతో కలుగు అనర్ధాలలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే ఆశతో యువత మాదక ద్రవ్యాలను రవాణా చేయడం, వాటిని అమ్మడం వంటివి చేపట్టి బంగారు భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారన్నారు. యువత ఇటువంటి చర్యలలో పాల్గొంటే 20 సంవత్సరాల జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని, జీవితం అంధకారమయమవుతుందని తెలిపారు. టెక్నాలజీ పెరగడంతో సోషల్ మీడియాలో నేరాలు చేయడం, తప్పుడు సందేశాలు ప్రచారం చేయడం చేస్తున్నారన్నారు. సైబర్ నేరాలు పెరుగుదల విషయంలో కూడా అప్రమత్తంగా ఉండాలని, వ్యక్తిగత సమాచారాన్ని గోప్యంగా ఉంచుకోవాలని ఆయన సూచించారు. మాదకద్రవ్యాల కు సంబంధించిన సమాచారాన్ని పోలీసులకు తెలపాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. సైబర్ నేరాలు జరిగినపుడు 1930 టోల్ ఫ్రీ నెంబర్ కి తెలపాలని సూచించారు.

జిల్లా ఎస్పి తుహిన్ సిన్హా మాట్లాడుతూ, చదువుపై దృష్టి సారించి ఉన్నత గమ్యాలను చేరుకోవడానికి నిత్యం శ్రమించాలన్నారు. మాదకద్రవ్యాలతో కలిగే అనర్ధాలను వీడియోల ద్వారా ప్రదర్శించారు. అనంతరం డి.ఐ.జి, ఎస్పిలను శ్రీ ప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి మోహన్, సిఐలు జి.అప్పన్న, కూమారస్వామి, రామకృష్ణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డిఐజి గోపీనాథ్


వినతి పత్రం అందజేస్తున్న మత్స్యకార నాయకులు

మత్స్యకారుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి -నక్కపల్లి:మత్స్యకారుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మత్స్యకార నాయకులు గురువారం తహసిల్దార్ నరసింహమూర్తి, ఎంపీడీవో డి సీతారామరాజు లకు వినతిపత్రం అందజేసారు. మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చాలని, వేట నిషేధ పరిహారం వెంటనే అందజేయాలని, వేట నిషేధ సమయంలో అందజేసే మత్స్యకార భరోసా వేట చేస్తున్న మత్స్యకారులతో పాటుగా చేపల వ్యాపారం చేస్తున్న మహిళలకు తమిళనాడు రాష్ట్ర తరహాలో అందజేయాలన్నారు. పరిశ్రమల స్థాపనతో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ చెల్లించాలని, స్థానిక పరిశ్రమలలో మత్స్యకారులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. తుఫానులు విపత్తుల సమయంలో వేట లేక వస్తువులతో ఉంటున్న మత్స్యకారులకు లేబర్ యాక్ట్ ప్రకారం వేతనం చెల్లించాలని, ప్రతి మండలానికి ఒక జెట్టి నిర్మాణం చేపట్టాలన్నారు.వినతి పత్రం అందజేసిన వారిలో మత్స్యకార నాయకులు గోసల చిన తాతారావు, కొవిరి వెంకటేష్, సత్తియ్య, పిక్కి గంగరాజు, శివ, కోదండరావు, శ్రీను, అప్పలరాజు, కాశీ, ఆదిరాజు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.


సీమంతం చేస్తున్న సేవా సమితి సభ్యులు

గర్భిణులకు సీమంతాలు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: పల్లె సేవయే పరమాత్ముని సేవ కార్యక్రమంలో భాగంగా పల్లె గ్రామాల్లో గురువారం సత్య సాయి సేవ సమితి (నర్సీపట్నం) ఆధ్వర్యంలో గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. దీనిలో భాగంగా డోనేపాలెం గ్రామం లో గ్రామ సేవ నిర్వహించారు. పేదలకు వస్త్ర దానం. చేశారు. ముందుగా నగర సంకీర్తన చేశారు.ఈ సందర్భంగా నర్సీపట్నం సత్యసాయి సేవా సమితి కన్వీనర్ రామకృష్ణ మాట్లాడుతూ, సాటి మనిషి కష్టాలలో వుంటే సహాయం చెయ్యాలని భగవాన్ శ్రీ సత్యసాయి బాబా చెప్పారని తెలిపారు.సత్యసాయి బాబా జన్మదిన వేడుకలు సందర్భంగా ఈ కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు.

సమస్యలపై ఆర్‌టిసి కార్మికుల ధర్నా

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: సమస్యలు పరిష్కరించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు స్థానిక ఆర్టిసి డిపోలో పని చేస్తున్న కార్మికులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అనకాపల్లి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యు.కోటేశ్వరరావు, పిఎన్‌వీ పరమేశ్వరరావు మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఎదురయ్యే కేసులలో పనిష్మెంట్లు ఒక క్రమ పద్ధతిలో ఉండాలని గత ఎండి ం ఇచ్చిన 1/ 2019 సర్క్యులర్ విధిగా అమలు చేయాలన్నారు. ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన జీవో నెంబర్ 70,71 లు మార్పు చేయాలని, సస్పెన్షన్ లు ఆపాలని డిమాండ్ చేశారు. డ్రైవర్, కండక్టర్, మెకానిక్, ఏడీసీలు సూపర్వైజర్లు ఆఫీస్ సిబ్బంది తదితర అన్ని కేటగిరీ ల ఉద్యోగులపై వేధింపులు, పనిష్మెంట్లు, ఆపాలని డిమాండ్ చేశారు. స్ప్రింగ్, టైర్, యుటిఎస్ టిమ్ము మిషన్ డామేజ్ రికవరీలు, పని భారాలు ఆపాలని కోరారు. ఈహెచ్ఎస్ స్థానంలో మెరుగైన వైద్య సౌకర్యం అందించాలన్నారు. పెండింగ్ మెడికల్ బిల్లు లు చెల్లించి నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సు లు ఇన్ సెంటివ్‌లు చెల్లించి అన్ని కేటగిరీల లో ప్రమోషన్‌లు కల్పించాలని కోరారు.అద్దె బస్సులు, ఔట్సోర్సింగ్ కార్మికులకు కాలాన్ డ్రైవర్లకు టైం స్కేల్ అమలు చేయాలన్నారు. థర్డ్ పార్టీ కాంట్రాక్టు విధానాన్ని రద్దు చేసి నేరుగా ఆర్టీసీ జీతాలు చెల్లించాలన్నారు.జన విజ్ఞాన వేదిక నాయకులు కే త్రిమూర్తులు రెడ్డి, అద్దె బస్సుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలకా సత్యనారాయణ, సిఐటియు జిల్లా కార్యదర్శి అడిగర్ల రాజు సంఘీభావం తెలిపారు. ఈ ధర్నాలో సిహెచ్ఎస్ వాసు, పి. సుబ్బారావు, ఎస్ రమణ పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న కార్మికులు, నాయకులు

యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి -రావికమతం:ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రావికమతం మండల నూతన శాఖ అధ్యక్షునిగా పోలిన అప్పారావు, ప్రధాన కార్యద ర్శిగా గెంజి నాగేశ్వరరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండలంలో మేడివాడ జిల్లా పరిషత్ హైస్కూల్లో గురువారం యుటిఎఫ్ జిల్లా సెక్రటరీ కే.సతీష్ ఆధ్వర్యంలో నూతన మండల కార్యవర్గం ఎన్నికను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. మండల మహిళ అధ్యక్షులుగా సిహెచ్. దుర్గ లక్ష్మి, గౌరవాధ్యక్షులుగా బంటు సత్యారావు, కోశాధికారిగా మట్ట అప్పారావు, కార్యదర్శులుగా యూ.వీ. రమణమూర్తి, సిహెచ్ స్వామి నాయుడు, తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ, యుటిఎఫ్ బలోపేతానికి శక్తి వంచన లేకుండా తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న పలు రకాల సమస్యలపై అలుపెరగని పోరాటం చేయడానికి కృషి చేస్తామన్నారు. ప్రభుత్వం నుంచి రాయితీలు వచ్చే విధంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పలు పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి


పరిశీలిస్తున్న విఆర్ఓ

రైతుల ఫిర్యాదులపై విచారణ

ప్రజాశక్తి-రావికమతం:ఇటీవల ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరుగుతుందని, ఇందుకు రైతులందరూ సహకరించాలని కవగుంట గ్రామ రెవిన్యూ అధికారి కమల కోరారు. మండలంలో కవగుంట గ్రామంలో గురువారం వీఆర్వో, సర్వేయర్ హరి ఆధ్వర్యంలో ఫిర్యాదులపై సత్వరమే పరిష్కరించే దిశగా పనిచేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ సందర్భంగా గ్రామ రెవెన్యూ అధికారి కమల మాట్లాడుతూ, రెవిన్యూ సదస్సులో రైతుల నుంచి వచ్చిన ఫిర్యాదులన్నింటిని క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో ఉన్న వాస్తవాలను తమకు తెలియజేయాలని కోరారు. సర్పంచ్ దాసరి సూర్య కుమారి మాట్లాడుతూ, గత ప్రభుత్వంలో జగనన్న రీ సర్వే ప్రక్రియలో చిన్న చిన్న మార్పులు, చేర్పులు జరగడం జరిగిందన్నారు. వాటిని గుర్తించి సరి చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఏ శ్రీను, బుల్లబ్బాయిపాల్గొన్నారు.

ఆధార్ నమోదు కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి- నక్కపల్లి:నక్కపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాజయ్యపేట సచివాలయంలో ఏర్పాటు చేసిన ఆధార్ నమోదు కేంద్రాలను గురువారం ఎంపీడీవో డి సీతారామరాజు పరిశీలించారు. ప్రభుత్వ ఆదేశాల ఆధార్ నమోదుకు నిర్వహిస్తున్న ప్రత్యేక క్యాంపును ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముఖ్యంగా విద్యార్థులు తమ పేర్లు, పుట్టిన తేదీల్లో తప్పిదాలుంటే సరి చేయించుకోవాలన్నారు.

పంచాయతీ భవనాన్ని పరిశీలించిన ఎంపిడిఒ

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలంలో మేజర్ పంచాయతీ కొత్తకోట పంచాయతీ కార్యాలయాన్ని గురువారం ఎంపీడీఓ బానోజీరావు, సర్పంచ్ లోవరాజు, ఉప సర్పంచ్ దేవా, ఈఓ జ్యోతేశ్వర్ రెడ్డి తదితరులు పరిశీలించారు. "ఈనెల 14న శిథిలావస్థకు చేరిన కొత్తకోట పంచాయతీ భవనం అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో వార్త ప్రచురితం కావడంతో ఎంపీడీఓ స్పందించారు. ఈ మేరకు కొత్తకోట పంచాయతీ కార్యాలయాన్ని పరిశీలించారు. స్లాబ్ నుంచి పెచ్చులు ఊడి పడిన సర్పంచ్ గదిని పరిశీలించారు. కనీసం మరమ్మతులు చేయడానికి కూడా వీలు పడని దుస్థితి పై ఆయన స్పందించారు.ఈ కార్యాలయంలో మూడు సచివాలయాలకు చెందిన సిబ్బంది విధులు నిర్వహించడం పై ఆయన ఆరా తీశారు. ప్రత్యామ్నాయంగా 80 శాతం పనులు పూర్తి అయిన రెండవ సచివాలయం భవనాన్ని పరిశీలించారు. అ సంపూర్తిగా నిలిచిన విషయాన్ని ఉన్నతాదికారుల దృష్టికి తీసుకువెళ్ళి పనులు పూర్తి చేయించి ఇక్కడ నిర్వహణ చేపట్టే విధంగా చర్యలు చేపడతామన్నా రు.


పరిశీలిస్తున్న ఎంపిడిఒ


రోడ్డు పనులు పరిశీలిస్తున్న నాయకులు

రోడ్డు పనులు ప్రారంభం

ప్రజాశక్తి-గొలుగొండ: మండలంలోని సిహెచ్ నాగాపురం గ్రామ శివారు వీధిలో గురువారం సీసీ రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ టీడీపీ నాయకులు బొప్పన ప్రసాద్ మాట్లాడుతూ, ఎన్‌ఆర్‌ఈజీఎస్ నిధులతో ఈ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రోడ్లకు మహర్దశ పట్టిందని చెప్పారు.

ఆలయం ప్రారంభం

ప్రజాశక్తి -కోటవురట్ల: ఐక్యతకు చిహ్నాలు ఆలయాలు అని పాయకరావుపేట నియోజకవర్గ వైసిపి ఇన్చార్జి కంబాల జోగులు అన్నారు. గురువారం పాములవాక శివారు సుర్లవానిపాలెం గ్రామంలో స్థానిక వైసీపీ నాయకులు కిల్లాడ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అడవి రాజులు బాబు ఆలయం ప్రారంభించారు. ఈ సందర్భంగా జోగులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాలు నిర్మించుకోవడంతో గ్రామాలలో స్నేహభావం పెంపొందుతుందని తెలిపారు. అనంతరం అన్న సమారాధన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సీతారామరాజు పాల్గొన్నారు.


పూజలు చేస్తున్న కంబాల జోగులు

నీటి సంఘం ఎన్నికల్లో సమర్థులను ఎన్నుకోవాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:సాగునీటి సంఘాల ఎన్నికల్లో సమర్థులని ఏకగ్రీవంగా ఎన్నుకోవాలని టిడిపి మండల శాఖ అధ్యక్షులు కొప్పిశెట్టి వెంకటేష్ కోరారు. మండలంలోని గొడిచెర్ల గ్రామంలో కొత్త చెరువు పరిధిలో రైతులు, కూటమి నాయకులతో మాజీ వైస్ ఎంపీపీ వైబోయిన రమణ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు.ఈ సమావేశానికి వెంకటేష్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్ర హెూంమంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు సాగునీటి సంఘాల ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలన్నారు. గత వైసిపి ప్రభుత్వం నీటి సంఘాలు, వ్యవసాయం పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిందన్నారు. ప్రతి ఎకరాకు నీరు అందించాలనే సంకల్పంతో నీటి సంఘాలు ఎన్నికల నిర్వహణకు కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రగడ మాణిక్యం, ప్రగడ బుజ్జి, దార్ల కృష్ణ, గెడ్డమూరి రమణ, కృష్ణమూర్తి, గాంధీ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న వెంకటేష్



ఎంపికైన క్రీడాకారులు

జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపిక

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లిలో బలిరెడ్డి సత్యవతి హాకీ క్లబ్ క్రీడాకారులు జాతీయ స్థాయి హాకీ పోటీలకు ఎంపికైనట్లు ఎస్‌జిఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం. నాగేశ్వరావు, హాకీ క్లబ్ ఫౌండర్ బలిరెడ్డి సూరిబాబు తెలిపారు. గురువారం నక్కపల్లిలో అభినందన సభ ఏర్పాటు చేసి ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఏపీ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నెల్లూరులో ఈ నెల 2 నుండి 4వరకు జరిగిన రాష్ట్ర స్థాయి అండర్ -17 బాల బాలికల హాకీ పోటీల్లో ప్రతిభ కనబరిచిన జెట్టి గాయత్రి హర్యానాలోని రోహతక్‌లో జరిగే జాతీయ పోటీలో పాల్గొంటుందన్నారు. అండర్ -14 విభాగంలో ఈనెల 8నుండి 10 వరకు అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో జరిగిన హాకీ పోటీల్లో బాలికల విభాగంలో జి.జ్యోతి, ఆర్. చైతన్య, కె.శ్రావ్య, బాలురు విభాగంలో కె. నాగ తరుణ్, ఎం.దిలీప్‌కుమార్, ఏ.దేవేంద్ర వెంకట్ ఎంపికయ్యారని వీరు మధ్యప్రదేశ్ మాండసోరిలో డిసెంబర్ 9నుండి 13 వరకు జరిగే జాతీయ హాకీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బాలురు విభాగంలో మధ్యప్రదేశ్ భోపాల్‌లో డిసెంబర్ 25 నుండి 31 వరకు జరిగే పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.అండర్ -19 బాల బాలికల విభాగంలో ఈనెల 16 నుండి 18 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి హాకీ పోటీల్లో బాలికల విభాగంలో ఎం. పూజిత, బాలురు విభాగంలో కె.సాయిరామ్, ఎం. మణికంఠ, కె. అనిల్ కుమార్‌లు డిసెంబర్ 9నుండి 13 వరకు జార్ఖండ్ రాంచిలో జరిగే జాతీయ స్థాయి హాకీ టోర్నమెంటులో పాల్గొంటారని వెల్లడించారు. క్రీడాకారులను అధ్యక్షులు చిన్న అప్పారావు, కార్యదర్శి కె.తాతాజీ, కోచ్ రాంబాబు అభినందించారు.

రామ్‌గోపాల్ వర్మపై కేసు నమోదు

ప్రజాశక్తి -రావికమతం: సినీ డైరెక్టర్ రామ్ గోపాల్ వర్మ పై కేసు నమోదు చేశామని రావికమతం ఎస్సై ఎం.రఘువర్మ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, 2024 మే 2న ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ల ఫోటోలు మార్ఫింగ్ చేసి వారిని కించపరిచే ఫోటోలను వర్మ ట్విట్టర్లో పోస్ట్ చేశారన్నారు. మండలంలో గుడ్డిప గ్రామానికి చెందిన తెదేపా సోషల్ మీడియా ప్రతినిధి గల్లా నానిబాబు ఫిర్యాదు చేశారన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి గురువారం రావికమతం పోలీస్ స్టేషన్లో హాజరు కావాలని సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మకు హైదరాబాద్ వెళ్లి స్వయంగా 41 నోటీసు అందజేశామన్నారు. వ్యక్తిగత పనుల కారణంగా వారం రోజులు గడువు ఇవ్వాలని రామ్ గోపాల్ వర్మ తరపున లాయర్ నర్సీపట్నం కి చెందిన అడ్వకేట్ మాకిరెడ్డి బుల్లిదొర కోరారని ఎస్సై రఘువర్మ తెలిపారు.

28న పాడేరులో జాబ్ మేళా

ప్రజాశక్తి-పాడేరు:ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభి వృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 28న (గురువారం) ఉదయం 10గంటల నుండి సాయంత్రం 3గంటల వరకు 4 కంపెనీలతో పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి డాక్టర్ పి రోహిణి , గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో నవత రోడ్ ట్రాన్స్పోర్ట్, అపోలో ఫార్మసీ, రుద్ర కార్పొరేట్ సర్వీసెస్, మదర్ అండ్ ఫాథర్ హెూమ్ కేర్ సర్వీసెస్ కంపనీలు పాల్గొంటున్నాయని తెలిపారు.జిల్లాలోని 18 సంవత్సరాల నుండి 30 ఏళ్ల ,మధ్య గల పదవ తరగతి, ఇంటర్మీడియట్, డిగ్రీ ఆపై చదువు పూర్తి చేసిన నిరుద్యోగ యువతీ యువకులు ఇంటర్వ్యూ కు పాన్ కార్డు, ఆధార్ కార్డు , సరిఫికేట్స్ జిరాక్స్ కాపీలతో హాజరు కావాలని తెలిపారు.

గ్యాంగ్ రేప్ నిందితులను కఠినంగా శిక్షించాలి

-ఐద్వా, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ ఆధ్వర్యాన ధర్నాలు, మానవహారాలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్

విశాఖ నగరంలో గ్యాంగ్ రేప్‌కు గురైన 'లా' విద్యార్థినికి న్యాయం చేయాలని, నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ గురువారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి మాట్లాడుతూ మహిళలపై అకృత్యాలు రోజురోజుకూ పెరగడంపై ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఐద్వా రాష్ట్ర అధ్యక్షులు బి.ప్రభావతి, విశాఖ జిల్లా కార్యదర్శి వై.సత్యవతి, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు యుఎస్ఎన్.రాజు, కె.సంతోష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, మాజీ కార్పొరేటర్ బొట్టా ఈశ్వరమ్మ, వివిధ కాలేజీలకు చెందిన విద్యార్థినులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో మానవహారం చేపడుతున్న విద్యార్థులు, నాయకులు

నక్కపల్లి : పాయకరావుపేటలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి విద్యార్థులు స్థానిక రహదారి వరకు ర్యాలీ నిర్వహించారు. మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా జిల్లా ఉపాధ్యక్షులు ఎం.బాలాజీ మాట్లాడుతూ విద్యార్థులకు, మహిళలకు రక్షణ కల్పించడంలో ప్రభుత్వం, హోం శాఖ విఫలమ య్యాయన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా నాయకులు కె.అర్జున్, సింహాద్రి, ఝాన్సీ, హేమ పాల్గొన్నారు.



నర్సీపట్నంలో...

నర్సీపట్నం టౌన్: న్యాయ విద్యార్థిని పై అత్యాచారంకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని ఎస్ఎప్ఐ, ఐద్వా, డివైఎప్ఐ నేతలు డిమాండ్ చేసారు. గురువారం స్థానిక అబిద్‌సెంటర్‌లో ఎస్ఎప్ఐ, ఐద్వాల అద్వర్యంలో మానవ హరం చేపట్టారు.విద్యార్థినిల పై జరుగుతున్న దాడులను అరికట్టడంలో ప్రభుత్వాలు విపలమయ్యాయని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నిర్భయ, ఫోక్సో వంటి చట్టాలు ఉన్నప్పటికీ రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గి అదికారులు చట్టాలను అమలు చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎప్ఎప్ఐ డివిజన్ కార్యదర్శి జనార్దన్, బూషణ్‌రావు, డివైఎప్ఐ డివిజన్ అధ్యక్షులు గౌతమ్, ఐద్వా జిల్లా ఉపాద్యక్షులు ఎల్ గౌరి, ట్రెజరర్ కెవి సూర్యప్రభ, మిడ్డే మీల్ డివిజన్ జిల్లా అద్యక్షులు కె ప్రసన్న, కేవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఈరెల్లి చిరంజీవి, ఆర్ దేముడునాయుడు పాల్గొన్నారు.



పాయకరావుపేటలో ఆందోళన చేపడుతున్న విద్యార్థులు

అనకాపల్లి : న్యాయ విద్యార్థినిపై సామూహిక అత్యాచార నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎం. రమణ డిమాండ్ చేశారు.గురువారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో వివిధ కళాశాలల విద్యార్థులు ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకు ర్యాలీగా వచ్చి మానవహారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణ మాట్లాడుతూ, విద్యార్థులు, మహిళలకు రక్షణ కల్పన, మహిళా చట్టాల పటిష్ట అమలులో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. యువత మద్యం గంజాయి మాదకద్రవ్యాలు అలవాటు పడి ఇటువంటి ఘటనలకు పాల్పడుతున్నారని, వాటి నియంత్రణకు ప్రభుత్వాలు చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు కె.అర్జున్, ఎం. వినయ్, వి .బాల, డి. సింహాద్రి పాల్గొన్నారు.

పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థ

ప్రజాశక్తి-మాధవధార : అత్యాచార ఘటనలు పునరావృతం కాకుండా ప్రత్యేక వ్యవస్థలు ఏర్పాటుచేసి నిందితులను కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ఒబిసి డిపార్ట్మెంట్ ఇంచార్జ్,పీసీసీ ప్రధాన కార్యదర్శి మూల వెంకటరావు డిమాండ్‌చేశారు. విశాఖ నగరంలో న్యాయ విద్యార్థినిపై ప్రేమ పేరుతో నయవంచన నాగరిక ప్రపంచాన్ని సిగ్గుతో తలదించుకునేటట్లు చేసిందని పేర్కొన్నారు. బాధిత విద్యార్థినికి, వారి కుటుంబానికి మనోధైర్యం కలిగించేలా చర్యలు తీసుకోవాలని, సత్వర న్యాయం జరిగేలా ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటుచేయాలని, యువతలో ఇలాంటి ఘటనలపై సామాజిక స్పృహను పెంచేందుకు రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక కాంపెయిన్‌లు చేపట్టాలని కోరారు

మత్స్యకారుల అభ్యున్నతికి కృషి

కలెక్టర్ విజయ్ కృష్ణన్



మాట్లాడుతున్న కలెక్టర్

ప్రజాశక్తి-నాతవరం:ప్రపంచ మత్స్య దినోత్సవం పరిష్కరించుకుని మండలంలోని చమ్మచింత పంచాయతీ తాండవ రిజర్వాయర్లో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ ఐదు లక్షల చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మత్స్యకారుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం పని చేస్తుందన్నారు. ప్రపంచ దినోత్సవం సందర్భంగా ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం ఆర్డిఓ వి.వి రమణ, జిల్లా మత్స్యశాఖ అధికారి పి.ప్రసాద్, మత్స్యశాఖ సహాయ అధికారి జాన్మి న్, మత్స్యశాఖ అభివృద్ధి అధికారి టి.నాగమణి, తహసిల్దార్ వేణుగోపాల్, ఎంపీడీవో ఉషశ్రీ, మత్స్యశాఖ నాతవరం మండల అసిస్టెంట్ అధికారి ఎన్.భూషణం, ఎంపీపీ సాగిన లక్షణామూర్తి, మాజీ జడ్పిటిసి కలక సత్యనారాయణ, మాజీ ఎంపీపీలు సింగంపల్లి సన్యాసి దేవుడు, నేతల విజయ్ కుమార్, మండల టిడిపి అధ్యక్షులు నందిపల్లి వెంకటరమణ, తాండవ రిజర్వాయర్ మాజీ చైర్మన్ పారుపల్లి కొండబాబు, చమ్మచింత సర్పంచ్ వెలగాడ కొండబాబు, టిడిపి నాయకులు, విలేజ్ ఫిషరీస్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం



విద్యార్థినిని సత్కరిస్తున్న చైర్మన్, ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-మాడుగుల:మండలంలో ఎమ్.కోడూరు ఉన్నత పాఠశాలలో మార్చిలో జరిగిన 10వ తరగతి పబ్లిక్ పరీక్షలలో అత్యధిక మార్కులు సాధించిన ముగ్గురు విద్యార్థులకు కీర్తిశేషులు గొల్లవిల్లి వరాహమూర్తి జయంతి పురస్కరించుకొని రూ.18,000 ల నగదు పురస్కారాలను అందజేశారు. మొదటి బహుమతిగా రూ.10,000, రెండవ బహుమతిగా రూ.5వేలు, మూడవ బహుమతిగా రూ.3వేల నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులను ఉద్దేశించి వరాహమూర్తి భార్య మాట్లాడుతూ, తన భర్త ఇదే పాఠశాలలో 5వ తరగతి వరకు చదువుకున్నారన్నారు.ఆయన ఆశయ సాధన కోసం ప్రతి ఏడాది ప్రతిభావంతులైన విద్యార్థులకు నగదు పురస్కారాలు అందించి, ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. నాగమణికీ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ గొల్లవిల్లి అప్పారావు పాల్గొన్నారు.



యూనిట్ పరిశీలిస్తున్న ఎంపిడిఒ

తాగునీటి ట్యాంకులకు క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాటు

ప్రజాశక్తి- మాడుగుల:మండలంలో 69 పంచాయతీల్లో రక్షిత మంచినీటి పథకాలకు అనుసంధానం చేస్తూ క్లోరినేషన్ యూనిట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపిడిఓ కొంకి అప్పారావు గురువారం తెలిపారు. ఈ మేరకు వీరనారాయణంలో మంచినీటి పథకానికి ఏర్పాటు చేసిన యూనిట్‌ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ, గ్రామ పంచాయితీల్లో వాటర్ టాంక్‌లు ఎత్తుగా ఉండటంతో వివిధ కారణాల మూలంగా బ్లీచింగ్ కలప లేకపోతున్నారన్నారు. క్లోరిన్ యూనిట్లు కిందన ఏర్పాటు చేసి టాబ్లెట్స్ లేదా క్లోరిన్ వాటర్ ను యూనిట్ ద్వారా ట్యాంకులోకి పంపవచ్చునని అన్నారు. అనంతరం ఆధార సేవా కేంద్రాలను సందర్శించారు. బ్యాంకు అకౌంట్లతో ఫోన్ నెంబర్లు లింక్ చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.